



# విజయభాను






విశాఖపట్నం, శుక్రవారం 15-06-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 264 పేజీలు : 8 వెల : 1 రూపాయి

### కేంద్రంతో తాడో పేడో

# తేల్చుకుందాం

**కేంద్ర అనుచిత వ్యాఖ్యలపై బాబు మండిపాటు**

**డయాఫ్రం వాల్ విజయవంతమైంది**

**ఒక్క పైసా తగ్గించినందుకే కేంద్రం ఇంత పరిహాసమా?**

**అభివృద్ధికి సహకరించాలి తప్ప అడ్డుకోరాదు**

**సీఎం చంద్రబాబు నాయుడు**



అమరావతి: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి డబ్బులు లేకున్నా ఖర్చు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఢిల్లీలో జరిగే నీతి ఆయోగ్ సమావేశంపై అమరావతి సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన

తరువాయి 2లో..

### బీసీల సంక్షేమానికి

# కట్టుబడి ఉన్నాం

- బీసీల సంక్షేమానికి జగన్ ఏం చేశారు?
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సవాల్



అమరావతి: ఎవరి హయాంలో బీసీలకు న్యాయం జరిగిందో తేల్చేందుకు బహిరంగ చర్చకు సిద్ధమా? మంత్రి అచ్చెన్నాయుడు వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డికి సవాల్ విసిరారు. విజయవాడ తుమ్మల పల్లి కళాక్షేత్రంలో జరిగిన విదేశీ విద్యాదీవెన లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. గత నాలుగేళ్లలో బీసీల కోసం రూ.16వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. పదేళ్ల కాంగ్రెస్ హయాంలో కేవలం రూ.7వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని మంత్రి

తరువాయి 2లో..

# కడప ఉక్కు పరిశ్రమపై తప్పుడు ప్రచారం

**హామీల అమలుకు భాజపా కట్టుబడి ఉంది**

**రాష్ట్ర భాజపా అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ**



హైదరాబాద్: కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. నిన్న కేంద్రం

తరువాయి 2లో..

# నిందితులకు జీవితఖైదు

- నాగవైష్ణవి అపహరణ, హత్య కేసు
- ఎనిమిదిన్నరేళ్ల తర్వాత తీర్పు
- నిందితులపై రుజువైన నేరాలు
- ఏ.పీ.లో సంచలనం సృష్టించిన కేసులో న్యాయస్థానం తీర్పు



అమరావతి: ఎనిమిదిన్నరేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన చిన్నారి పలగాని నాగ వైష్ణవి అపహరణ, హత్య కేసులో విజయవాడలోని మహిళా సెషన్స్ న్యాయస్థానం గురువారం తీర్పు వెలువరించింది. ముగ్గురు నిందితులు మోర్ల శ్రీనివాసరావు, యంపరాల జగదీశ్, వెంకటరావుగౌడ్‌లకు న్యాయమూర్తి జీవిత ఖైదు విధించారు. హత్య, అపహరణ నేరాలు రుజువు కావడంతో నేరస్తులకు జీవిత ఖైదు విధిస్తున్నట్లు న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ఈ తీర్పుపై నిందితులు ఉన్నత న్యాయస్థానంలో అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించారు.

న్యాయస్థానం తీర్పు పట్ల నాగవైష్ణవి బంధువులు, విద్యార్థి, ప్రజా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే తీర్పు కోసం ఏకంగా ఎనిమిదిన్నరేళ్లు పట్టడంపై మాత్రం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. న్యాయం కోసం పోరాడిన నాగవైష్ణవి తల్లి నర్మదాదేవి గతేడాది మృతిచెందారని.. ఆమె బతికుండగానే తీర్పు వస్తే ఆ కుటుంబానికి స్వాంతన కలిగేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మాటల్లో చెప్పలేని విషాదం..**

నాగవైష్ణవి కేసులో ఆద్యంతం కన్నీరుపెట్టించే మలుపులెన్నో. ఈ ఘటనలో కారు డ్రైవరు సంఘటనా స్థలంలోనే కత్తిపోట్లకు గురై ప్రాణాలు కోల్పోగా... కుమార్తె చనిపోయిన బాధ దిగమింగుకోలేక తండ్రి గుండెపోటుతో మృతి చెందాడు. విచారణ క్రమంలో న్యాయం కోసం పోరాడుతున్న చిన్నారి తల్లి, బాబాయి మరణించడం అత్యంత హృదయ విదారకరం. ఈర్ష్య, అసూయ, ఆస్తి కోసం వివాదాలే ఈ దారుణానికి కారణంగా నిర్ధారించిన పోలీసులు ముగ్గురు నిందితులను కటకటాల్లోకి నెట్టారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ 79 మంది సాక్షులను, డిఫెన్స్ 30 మంది సాక్షులను ప్రశ్నించింది.

**గొంతు నులిమి చంపేసి.. బూడిద చేశారు**

2010 జనవరి 30న నాగవైష్ణవి తన సోదరుడితో కలిసి కారులో పాఠశాలకు వెళ్తుతుండగా దుండగులు అడ్డగించి అపహరించారు. ప్రతిఘటించిన కారు డ్రైవరు లక్ష్మణరావును కత్తితో గొంతులో పొడిచి హత్య చేశారు. ఇదే సమయంలో కారులోని నాగవైష్ణవి సోదరుడు తప్పించుకుని పారిపోయాడు. అదేరోజు నాగవైష్ణవిని కారులో విజయవాడ నుంచి గుంటూరు వైపు తీసుకెళ్తూ గొంతు నులిమి హతమార్చారు. మృతదేహం ఆనవాళ్లు కూడా కనిపించకుండా చేసేందుకు

తరువాయి 2లో..

# తెదేపాలో ఇమడలేను

**వైకాపాలో చేరతానన్నది అభిమానుల ఊహాగానమే**

**ఏ పార్టీలో ఎప్పుడు చేరాలో నిర్ణయం తీసుకుంటా**

**మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి**



నెల్లూరు: మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెదేపాను వీడాలని నిర్ణయించుకొన్నారు. ఈమేరకు ఆయన ఆత్మకూరు నియోజకవర్గంలోని నాయకులకు తేల్చి చెప్పేశారు. ఆనం రాజకీయ గమనంపై కొంతకాలంగా ఊహాగానాలు కొనసాగుతూ ఉన్న విషయం తెలిసిందే. ఆయన తెదేపాను వీడి వైకాపాలో చేరతారనే ప్రచారం కొంతకాలంగా ఉంది. దానికితోడు జిల్లా మహానాడు, విజయవాడ మహానాడులకు ఆయన గైర్హాజరవడంతో ఈ ప్రచారం మరింత ఊపందుకొంది. ఈ క్రమంలో ఆయన ఆత్మకూరు నియోజకర్గంలోని మండలాల ముఖ్య నాయకులను పిలిపించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెదేపాలో ఇంక ఇమడలేమని, వీడాలని నిర్ణయించుకొన్నట్లు వివరించారు. అందుకు దారి తీసిన కారణాలు వివరించారు. ఆత్మకూరు నియోజకవర్గం నుంచే వచ్చే ఎన్నికల బరిలో ఉంటానని ఈ విషయంలో అపోహ వద్దని నాయకులకు తేల్చి చెప్పారు. ఏ పార్టీలో ఎప్పుడు ఎలా చేరాలనే విషయం ఈ నెల 20వ తేదీన ఏర్పాటు చేసే ప్రత్యేక సమావేశంతో నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరితో మాట్లాడి నిర్ణయిస్తామని తెలిపారు. దాంతో మాజీమంత్రి ఆనం రాజకీయ గమనంపై నెలకొన్న ప్రచారాలు కొలిక్కి వచ్చే పరిస్థితి నెలకొంది. ఆనంకు జిల్లా స్థాయిలో అనుచరగణం, అభిమానులు, నాయకులు ఉన్నారు. దాంతో ఆయన నిర్ణయం అదే స్థాయిలో ప్రభావం చూపనుంది.

## ఎన్ఆర్ఐ భర్త వేధింపులకు భార్య మృతి

వార్త 7వ పేజీలో..













# పరిసరాల పరిశుభ్రతకు దోహదపడండి

- అన్ని కాలువల్లో చెత్తను తొలగించండి
- ప్రజారోగ్యానికి భంగం కలిగిస్తే జరిమానా
- భూపేష్‌నగర్ కాలనీని మరింత పరిశుభ్రంగా నిర్వహించండి
- డంపర్‌బిన్ల చుట్టూ పరిశుభ్రంగా ఉంచండి
- పుట్‌పాత్‌లపై హొటల్స్ నిర్వహణపట్ల అసంతృప్తి
- జివిఎంసి కమిషనర్ హరినారాయణన్



విశాఖపట్నం: ప్రజలు, ప్రజారోగ్య సిబ్బంది పరిసరాల పరిశుభ్రతకు దోహదపడాలని జివియంసి కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. క్షేత్రపర్యటనలో భాగంగా మూడవజోన్ 29, 30 వ వార్డులలో పర్యటించి పలుసూచనలు చేశారు. అన్ని కాలువలలో చెత్తను తొలగించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రజలు చైతన్యవంతం కావాలని ప్రజారోగ్యఅధికారులు, సిబ్బంది అందుకు దోహదపడాలని పేర్కొన్నారు. భూపేష్‌నగర్ కాలనీని సందర్శించి కాలువలు, రహదారులను 15 రోజులలో వేయడం ద్వారా పరిసరాల పరిశుభ్రతకు నాందీపలకాలని కోరారు. అదేవిధంగా యుజిడి లైన్ల వేయడం ద్వారా అపారిశుధ్యానికి చరమగీతం పాడాలని పేర్కొన్నారు. పరిశుభ్రతే ఆరోగ్యమని-ఆరోగ్య విశాఖ లక్ష్యంగా ప్రతి పారిశుధ్య కార్మికుడు విధులు నిర్వర్తించాలని కోరారు. మేన్‌హోల్స్ తొలగించి మరుగు లేకుండా చూడాలని ఆదేశించారు. డంపర్‌బిన్ల చుట్టూ, క్రింద అపారిశుధ్య పరిస్థితులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. పుట్‌పాత్‌లను ఆక్రమించి హొటల్స్ నిర్వహించరాదని ఆదేశించారు. 75 అడుగుల రోడ్, పుట్‌పాత్‌లు పని సత్వరం పూర్తి చేయాలని పేర్కొన్నారు. కొబ్బరి తోటలోని ప్రజామరుగుదొడ్లను పరిశీలించి మరింత పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. అనంతరం రామక్రిష్ణా రైతుబజార్ పనుల పురోగతిని పరిశీలించారు. అపారిశుధ్యానికి కారణమైన కింగ్‌బార్ అండ్ రెస్టారెంట్‌కు రూ.5000/- అపరాధరుసుం విధించారు. అడుగడుగునా పారిశుధ్యాన్ని పరిశీలించి పలుసూచనలు చేశారు.

పర్యటనలో ఏ.యం.ఓ.హెచ్ డా.సుధాకర్, ఇ.ఇ గణేష్‌కుమార్, ఏసిపి సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జోనల్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఆన్‌లైన్‌లో జెన్యునెస్ పత్రాలు జారీ

**నూతన విధానాన్ని ప్రారంభించిన వీసీ నాగేశ్వర రావు**



ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఏ.యూ.లో ఆన్‌లైన్‌లో సర్టిఫికేట్లకు జెన్యునెస్‌ను అందించే విధానాన్ని వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు గురువారం ఉదయం ప్రారంభించారు. ఇకపై విద్యార్థుల సర్టిఫికేట్లకు సంబంధించిన జెన్యునెస్‌ను వేగవంతం చేయడానికి ఈ విధానం ఎంతో ఉపకరిస్తుంది. విద్యార్థికి సంబంధించిన జెన్యునెస్‌కోసం దరఖాస్తు వచ్చిన వెంటనే వాటిని పరిశీలించి సత్వరం సంబంధిత పరీక్షల విభాగం నుంచి జెన్యునెస్ సర్టిఫికేట్‌ను జారీ చేసే అవకాశం కలుగుతుంది. సాంకేతికతను పూర్తిస్తాయిలో సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులకు సత్వర సేవలు అందించే విధంగా విశ్వవిద్యాలయం పనిచేస్తోందన్నారు.

కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.వి సుధాకర్ రెడ్డి, కంప్యూటర్ సెంటర్ సంచాలకులు ఆచార్య కె.వెంకట రావు, డిప్యూటి రిజిస్ట్రార్‌లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు తదితరులు పాల్గొన్నారు.

# 16న కళాకారుల ఆత్మీయ అభినందన సభ

**బ్రోచర్‌ను ఆవిష్కరించిన మంత్రి గంటా శ్రీనివాస్**



విశాఖపట్నం : ఈ నెల 16న జరగనున్న కళాకారుల ఆత్మీయ అభినందన సభకు కళాకారులంతా హాజరు కావాలని విశాఖ కళాకారుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు క్యాలు జనార్ధన్ కోరారు. ఎంవిపిలో గల మంత్రి గంటా నివాసంలో గురువారం ఉదయం రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా క్యాలు జనార్ధన్ మాట్లాడుతూ సంగీతం, సాహిత్యం, నృత్యం, చిత్రలేఖనం, గానం, నాటకం తదితర రంగాలకు చెందిన కళాకారుల ఆత్మీయ అభినందన సభ ఈ నెల 16న సాయంత్రం 6గంటలకు సూర్యాభాగ్ దగ్గర గల వైశాఖి జల ఉద్యానవనంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావుతోపాటు రాజకీయ, కళారంగ ప్రముఖులు హాజరు కానున్నారని జనార్ధన్ తెలిపారు. ఈసందర్భంగా చిత్రగీతాలు, కూచిపూడి, జానపద, పాశ్చాత్య నృత్యాలు, మిమిక్రీ, మ్యాజిక్ షో వంటి సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని ఉన్న అన్ని రంగాల కళాకారులు హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్నేహాంజలి ఆర్ట్స్ అధ్యక్షులు వి.ఎన్.మూర్తి, ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు చెన్నా తిరుమలరావు, యాక్మీ ఈవెంట్ మేనేజర్ పి.ప్రతాప్ కుమార్, సంఘం ప్రధాన కార్యదర్శి పి.ఎస్.ఎస్.కుమార్, కోశాధికారి పి.నాగరాజు పాల్గొన్నారు

# అందరికీ గృహాలు నిర్మాణానికి స్థలాలు అందజేయండి

- కోర్టు కేసులుంటే పరిష్కరించండి
- స్థలాలు కేటాయించినప్పటికి స్థానిక సమస్యలు
- జివియంసి ద్వారా స్థలాలను టిడ్కోకు కేటాయింపు
- జివిఎంసి కమిషనర్ హరినారాయణన్

విశాఖపట్నం: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం క్రింద అందరికీ గృహాలు నిర్మాణానికి తహసీల్దార్లు జివియంసికి స్థలాలు అందజేయాలని కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్, తహసీల్దార్లు, సి.సి.పి ., ఏసిపిలతో గురువారం ఆయన సమావేశమైనారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గృహనిర్మాణాలకు అనువైన, సమస్యలు లేని స్థలాలకు సంబంధిత తహసీల్దార్లు జి.వి.యం.సికి అప్పగించాలని పేర్కొన్నారు. డి.పి.ఆర్ రూపొందించక ముందు స్థలాలు కేటాయించాలని ఆదేశించారు. డి.పి.ఆర్ రూపొందించి, నిర్మాణాలు చేపట్టిన తరువాత వివాదాలు, కోర్టు కేసులవలన గృహనిర్మాణం వేగవంతం కావడం లేదని అభిప్రాయపడ్డారు. పెద్ద పెద్ద స్థలాల కంటే ఒకఎకరా, చిన్న చిన్న స్థలాలను గుర్తించి కేటాయించడం ద్వారా గఋహనిర్మాణాలు చేపట్టనున్నట్లు వివరించారు.

కోర్టు కేసులుంటే వాటిని వెకేట్ చేయడం, స్థలాలు ఉన్నప్పటికి స్థానిక సమస్యలు, స్థలాలు గుర్తించినప్పటికీ కేటాయించని స్థలాలు వివరాలను సోమవారం నాటికి ఫీజిబిలిటీ ఉన్న స్థలాలను జివియంసికి అప్పగించాలని కోరారు.

జాయింట్ కలెక్టర్ జి.సృజన స్థలాల వివరాలను తహసీల్దారులకు అడిగి తెలుసుకొని, పలు సూచనలు చేశారు. యుసిడి ప్రాజెక్టు డైరక్టర్ డి.శ్రీనివాసన్ సర్వేనెంబర్లవారీగా స్థలాల వివరాలు, వాస్తవ పరిస్థితులను వివరించారు. సమావేశంలో సిసిపి విద్యుల్లత, సిపిలు, ఏసిపిలు, తహశీల్దార్లు, టిడ్‌కో అధికారులు సర్వేయర్లు పాల్గొన్నారు.

# విశాఖలో మోషన్ ఐఐటి అకాడమీ నేడే ప్రారంభం

విశాఖపట్నం : విద్య అనేది వాణిజ్యం కాదని, విద్యార్థు అభివృద్ధి కోసమే అనే నినాదంతో ప్రారంభమైనదే రాజస్థాన్ లోని కోటా నగరంలో స్థాపించిన మోషన్ విద్యా సంస్థ ఐఐటి ' జెఇఇ, మెడికల్. ఈ విద్యా సంస్థ ద్వారా వేలాది మంది విద్యార్థినీ విద్యార్థుల ఐఐటి 'జెఇఇ లోను. మెడికల్ పరీక్షల్లోను అత్యద్భుతమైన ఫలితాలు అందించి దేశంలోనే అత్యుత్తమ స్థానంలో నిలిచిందని మోషన్ విశాఖ కేంద్రం డె%రక్టర్ కాండ్రేగుల ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి ఒత్తిడి లేకుండా ఆధునిక సౌకర్యాల ద్వారా విద్యను నేర్పించడమే ఈ మోషన్ ఐఐటి అకాడమీ సంస్థ విజయరహస్యమన్నారు. ఐఐటి శిక్షణా విద్యా విధానంలో డిజిటల్ స్కీన్స్ ద్వారా శిక్షణ ఇచ్చే మొట్టమొదటి సంస్థ మోషన్ ఆకాడమీ అని తెలిపారు. విశాఖ కేంద్రంగా ఈ సంస్థ శాఖను పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్నామని, ప్రధానంగా డే స్కాలర్ల కోసం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఏర్పాటు చేయడం జరిగిందని, ఉత్తరాంధ్రా జిల్లా విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ విద్యా సౌలభ్యం నెకొల్పామని, వాటిల్లో బాలురకు , బాలికలకు వేర్వేరుగా ఏర్పాటు చేసామన్నారు. ప్రతీ తరగతిలోను కేవలం 40 మంది విద్యార్థులు మాత్రమే ఉంటారని, ఆ పైబడిన విద్యార్థుల కొరకు మరో తరగతి గది లో శిక్షణ అందించడం జరుగుతుందని వివరించారు. రోజుకు కేవలం 6 నుంచి 8 గంటల సమయం మాత్రమే విద్యా విధానం అమలు లో ఉంటుందని, ప్రతీ వారం నిర్వహించే వారాంతపు పరీక్షల ద్వారా విద్యార్థి పోరాట పటిమ, విద్య ప్రతిభను గమనించి, వారికి ప్రత్యేక శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. కేవలం డిజిటల్ విద్యా విధానం ద్వారా నిర్వహించే తరగతి విద్యా విధానం అత్యుత్తమ ఫలితాలను సాదించడం జరిగిందన్నారు. గత ఏడాది తమ మాతృ సంస్థ ద్వారా శిక్షణ పొందిన 68 శాతం విద్యార్థు ఐఐటి కి అర్హత సాధించారన్నారు. ఉత్తరాంధ్రా, జిల్లాల నుంచి వంద సంఖ్యలో రాజస్థాన్ లోని కోటా నగరానికి వెళ్ళి మోహన్ అకాడమీ లో చేరి, ఉత్తమ ఫలితాలు సాధించారని, వీరందరిని లక్ష్యాన్ని దృష్టి లో ఉంచుకుని విశాఖ నగరంలోనే పలు శాఖ ను ప్రారంభించాలని అని మోషన్ విద్యా సంస్థ సంకల్పించి ఇక్కడ పలు శాఖను ఏర్పాటు చేసిందని వివరించారు. ఈ శాఖల్లో డే స్కాలర్లకు, రెసిడెన్షియల్ విద్యార్థులకు వేర్వేరు క్యాంపస్‌లు ఏర్పాటు చేసామన్నారు. బాలురకు , బాలికలకు సైతం ప్రత్యేక క్యాంపస్ ను నెల కొల్పడం జరుగుతొందన్నారు.

***రాజస్థాన్ ఫ్యాకల్టీతోనే శిక్షణ***

మోషన్ అకాడమీ కేంద్ర కార్యాలయం కోటా నుంచి వచ్చిన అత్యుత్తమ అధ్యాపకులచే విశాఖ కేంద్రంలోని శాఖల్లో తరగతుల నిర్వహించబడతాయని తెలిపారు. వీరికి అదనంగా సీనియర్ ఐఐటి శిక్షకులు ఉండి, ఒక్కో పాఠ్యాంశానికి ఇద్దరు నుంచి, ముగ్గురు అధ్యాపకులచే తరగతులు జరుగుతాయన్నారు.

విశాఖ నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గ హోటల్ మేఘాలయ దరి తమ సంస్థను శుక్రవారం ఉదయం 9 గంటకు విశాఖపట్నం లోక్ సభ సభ్యులు, విద్యా వేత్త డాక్టర్ కె. హరిబాబు ప్రారంభిస్తారన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సెంచూరియన్ విశ్వవిద్యాయం ఉపకులపతి డాక్టర్ జిఎస్ఎన్ రాజు, ఆంధ్ర విశ్వకళాపరిషత్ ఉపకులపతి డాక్టర్ జి. నాగేశ్వరరావు, స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అద్యక్షుడు ఆడారి కిశోర్ కుమార్ తదితరులు హాజరవుతారన్నారు.

***యువశక్తి చరిత్ర తిరగరాస్తోంది*** :

విద్యను నముకున్న యువతరం తమ శక్తి సామర్ధ్యాలను నమ్ముకుని అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నాయని, విశ్రాంత మునిసిపల్ కమిషనర్ దువ్వారపు రామారావు, సీనియర్ విద్య వేత్త జూతీశీట కోటేశ్వర రావు, ప్రముఖ న్యాయవాది నర్రా వెంకట రమణ, లు అభిప్రాయపడ్డారు. పాఠశాల విద్యా తర్వాత సరైన మార్గదర్శకం లేని యువతకు అండగా నిలబడిన ప్రవీణ్ కుమార్ బృందానికి అభినందనలు తెలిపారు. పదవ తరగతి తర్వాత నేరుగా ఉన్నత విద్య చదవడం ఉండదని, మంచి ఆశయాలు కల్గిన విద్యా సంస్థ అండగా నిబడితే విద్యార్థు ఉత్తమ భారతీయుగా తయారవుతారన్నారు.

కార్యక్రమంలో రిషాలి మేనేజ్‌మెంట్ కళాశా ఎండీ శ్రీనివాస్ మాట్లాడుతూ డిజిటల్ విధానం ద్వారా పాఠ్యాంశాలు వివరించడం అత్యుత్తమ విద్యా విధానంగా మారుతోందని, ఈ సాంకేతిక విప్లవం విశాఖకు వస్తుండడం అద్భుతమన్నారు. స్టూడెంట్ జె ఏ సి రాష్ట్ర అధ్యక్షులు ఆడారి కిషోర్ కుమార్ తదితరులు హాజరై ప్రస్తుత విద్యా విధానానికి, ఇతర సంస్థల్లో అమలవుతున్న విద్యా విధానానికి ఎంతో వ్యత్యాసం ఉందన్నారు.


# గీతం ఆస్పత్రిలో రక్తదాన శిబిరం



సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) ఆస్పత్రి ఆద్వర్యంలో ప్రపంచ రక్తదాతల ధినోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు.గీతం ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ నిపుణుల పర్యవేక్షణలో జరిగిన ఈ రక్తదాన శిబరాన్ని గీతం గీతం ఆసుపత్రి సూపరెంటెండెంట్ డాక్టర్ పి.శ్యామ్‌ప్రసాద్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. పి. రావు ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయిన మాట్లాడుతూ ఆత్యవసర పరిస్థితులలో మనిషి ప్రాణాలను కాపాడటానికి బ్లడ్ బ్యాంకల ద్వారా సేకరించే రక్తం ఉపయోగపడుతుందన్నారు. రక్తదానం చేసే వారికి ఆరోగ్యపరంగా మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. గీతం ఆస్పత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ మూడు నెలలకు ఒక సారి రక్తదానం చేయిడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయి అదుపులో ఉండి గుండెజబ్బులను దరిచేరనీయదని పేర్కొన్నారు.ఇప్పటివరుకు తాను 74 రక్తదాన శిభరాలలో రక్తదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాదాపు 200 మంది విద్యార్థులు పాల్గొని స్వచ్ఛంధంగా రక్తదానం చేశారు. కార్యక్రమాన్ని గీతం బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఆర్.సుధాకర్, ఎన్.ఎస్.ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.రమణరావు పర్యవేక్షంచారు.

# గీతం లో ఇంజనీరింగ్ తరగతులు ప్రారంభం

## వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు




సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలలో ఇంజనీరింగ్ తరగతులు బుధవారంన ప్రారంభమయ్యాయి. గీతం విశ్వవిద్యాలయం జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు గత నెలలో నిర్వహించిన అడ్మిషన్ కౌన్సెలింగ్ ద్వారా వివిధ కోర్సులలో ప్రవేశాలు కల్పించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా ఒడిస్సా, పశ్చిమ బెంగాల్, ఝూర్ఖండ్, ఛత్తీస్‌ఘడ్, బీహార్, అస్సాం, మహారాష్ట్ర, ఢిల్లీ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులతో విశ్వవిద్యాలయం ప్రాంగణం కిటకిటలాడింది. విద్యార్థులు సౌకర్యార్థం ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లను, ఒరిజినల్ సర్టిఫికేట్‌ల తనిఖీ విభాగాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది హస్టల్ వసతి సధుపాయం పూర్తి స్థాయిలో కల్పించేందుకు విశ్వవిద్యాలయం ఏర్పాట్లు చేయడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

**దేశం గర్వించదగ్గ ఇంజనీరింగ్ నిపుణులుగా తయారు చేస్తాం: జిఐటి ప్రిన్సిపాల్**

మొదటి రోజు విద్యార్థులు, తల్లిదండ్రులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఇంజనీరింగ్ విద్యతో పాటు సాఫ్ట్‌వేర్ రంగంలో వస్తున్న మార్పులను, భౌగోళిక రాజకీయ పరిణామాలను గమనిస్తున్నామని తదనుగుణంగా సిలబస్‌లో మార్పులు చేస్తున్నామని దేశం గర్వించదగ్గ ఇంజనీరింగ్ నిపుణులుగా విద్యార్థులను తయారు చేయడం తమ లక్ష్యమన్నారు. ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థి పైన ప్రత్యేక శ్రధ్ధతో వ్యవహరించడానికి ఫ్యాకల్టీ సభ్యులతో ఏర్పాటైన కమిటీలను ఆయన వివరించారు. ఇంజనీరింగ్ లో ప్రవేశం పొందే విద్యార్థి మొదటి సంవత్సరం అత్యంత జాగ్రత్తతో కోర్సు ను అభ్యసించాలని ఏ విధమైన ఇబ్బందులు ఎదుర్కొన్న ఫ్యాకల్టీ సభ్యుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఇంజనీరింగ్ విద్యలో వస్తున్న సరికొత్త మార్పులను విద్యార్థులకు బోధించటంతో పాటు ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సిబిసిఎస్) మరియు ఓపెన్ ఎలక్టివ్స్ విధానాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గీతం లో ప్రవేశం పొందే విద్యార్థులకు ప్రాంగణ నియామకాలలో ఎంపికయ్యే విధంగా దశల వారీ శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వైస్-ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.ధర్మరాజ్ తదితరులు పాల్గొని విద్యార్థులకు సూచనలు చేశారు.

### ఖచ్చితమైన ఓటర్ల జాబితాకు
# రాజకీయ పార్టీలు సహకరించాలి
**జిల్లా రెవెన్యూ అధికారి సి.చంద్రశేఖర్‌రెడ్డి**



విశాఖపట్నం: తప్పులు లేని ఓటర్ల జాబితాను తయారు చేయడానికి రాజకీయ పార్టీలు బూత్‌స్థాయి అధికారులను నియమించి, వారి జాబితాలను ఆగస్టు 15లోగా సంబంధిత ఇఆర్‌ఓలకు అందజేయాలని జిల్లా రెవెన్యూ అధికారి సి.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం డిఆర్‌ఓ ఛాంబరులో ఓటర్ల జాబితా ప్రత్యేక రివిజన్‌పై రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ జూన్ నెల 30వరకూ బిఎల్‌ఓలతో క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెరిఫికేషన్ జరుగుతుందని, అదేవిధంగా జూలై 1 నుండి 31వతేదీ వరకూ పోలింగ్‌స్టేషన్ల రేషనలైజేషన్ జరుగుతుందని, ఈ రెండు అంశాలపై బిఎల్‌ఓలకు రాజకీయ పార్టీలు సహకరించాలని ఆయన కోరారు. జనవరి 01, 2018 నాటికి 18ఏళ్లు నిండి ఓటర్ల జాబితాలో నమోదు కాని పౌరులను ఓటర్లుగా చేర్పించాలని అన్నారు. నవంబరు 30లోగా క్లెయిమ్స్, అభ్యంతరాలు తెలుపుకునే అవకాశం వుందని, జనవరి 4న ఓటర్ల జాబితా తుది ప్రచురణ జరుగుతుందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 8వేల నుండి 10వేల వరకూ అర్హులైన పౌరులు జాబితాలో ఇంకనూ చేరవలసి వుందని, వారిని గుర్తించి ఓటర్ల జాబితాలో చేర్పించాలని, అదేవిధంగా మరణించిన, బదిలీ అయిన, డబుల్ ఎంట్రీలు వున్న ఓటర్లను తొలగించాలని సూచించారు. త్వరగా బిఎల్‌ఓల జాబితాలను పార్టీ ప్రతినిధులు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో భారత జాతీయ కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ, వైఎస్సార్ సీపీ, సిపిఐ, సీపీఎం, బిఎస్‌పి పార్టీలకు చెందిన ప్రతినిధులు, ఎన్నికల సూపరెంటెండెంట్ మూర్తి, రవి తదితరులు పాల్గొన్నారు.


ఎస్.ఎల్.నెం.223/2018/ సీ.స. జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము
తేదీ: 09/06/2018 విశాఖపట్నం

**పత్రికా ప్రకటన**

విశాఖపట్నం నగర కాపురస్తులు శ్రీ జువ్వల విజయ్ (తండ్రి : నాగరత్నం) ఈ క్రింద పట్టికలలో తెలిపిన స్థలమునకు "నిరభ్యంతర ధృవీకరణ పత్రము" (NOC) మంజూరు చేయవలసినదిగా కోరియున్నారు.

| గ్రామము పేరు | సర్వేనెం. | విస్తీర్ణము (చ.మీట్) |
| --- | --- | --- |
| మాధవధార | 24/IA2/A1 | 0.0447 |

పైన తెలిపిన భూమికి "నిరభ్యంతర ధృవీకరణ పత్రము" (NOC) మంజూరు చేయుటకు ఎవరికయినా ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో, ఈ ప్రకటన అందిన 15 దినముల లోగా శ్రీ జాయింట్ కలెక్టర్ మరియు కాంపిటెంట్ అథారిటీ, అర్బన్ ల్యాండ్ సీలింగ్, కలెక్టర్ కార్యాలయము, విశాఖపట్నం వారికి లిఖిత పూర్వకముగా తెలియజేయవలసినదిగా కోరడమైనది.

**G.SRIJANA**
జిల్లా జాయింట్ కలెక్టర్
మరియు కాంపిటేంట్ అథారిటీ
అర్బన్ ల్యాండ్ సీలింగ్ విభాగము
విశాఖపట్నం

# తలసరి ప్రమాణాలు అధిగమించాలి : జెసి వెంకటరమణారెడ్డి



విజయనగరం: వెనుకబడిన జిల్లా అయినా కీలక రంగాల్లో తమ పనితీరు సూచీలో రాష్ట్ర, దేశ తలసరి ప్రమాణాలను మనం అధిగమిం చాలని జాయింట్ కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం విద్య, వైద్యం, వ్యవసాయం, నీటిపారుదల సౌకర్యాలు, ఆర్థిక సౌలభ్యం, మౌళిక సౌకర్యాల కల్పన యువతలో నైపుణ్యాభివృద్ధి వంటి కీలక రంగాలలో జరుగుచున్న అభివృద్ధి సూచిపై జిల్లా అధికారుల సమావే:ంలో మాట్లాడారు. విద్యా రంగంపై జరిగిన సమీక్షలో ప్రాధిమిక విద్య స్థాయిలోనే బాలబాలికలు ఇద్యపై పాఠశాలల్లో టీచర్లు ఎంతో శ్రద్ధ చూపిపంచి వారిలో విద్యపై నిరంతర ఆసక్తి కనబరుచుటకు చక్కని ప్రణాళికలు రూపొందిచాలన్నాఉ. ప్రాధిమిక, ప్రాధిమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్ధులు మధ్యలో బడి మానివేయకుండా పూర్తి శ్రద్ధ చూపాలని అన్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ ఈ నెలాఖరులోగా అందించాలన్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. బిందు సేద్యంతో సమా సాగునీటి వసతులు రైతులకు కల్పించాలన్నారు. పతిలక్ష మంది జనాభారు ముద్రాలోన్లు తలసరిగా మార్చి ఆఖరుకు 9.68 కోట్లు అందించటం జరిగిందని తెలిపారు. పిఎంజెజెబివై అటల్ పింఛను ఆధార్‌తో బ్యాంకు అకౌంట్‌ల లింకేజి విషయాలు నైపుణ్యాభివృద్ధి కేంద్రాల పనితీరు , ంఏర్పాటు అభివృద్ధిలపై సమీక్ష జరిపారు.

# అంతా భగవంతుని సంతానమే: మక్కా మజీద్ కమిటీ సభ్యులు మహ్మద్ ఆలీ

విజయనగరం : ప్రపంచ ప్రజలంతా ఒక్కటేనని అంతా భగంతుని సంతానమని మనం కలిసిమెలిసి జీవించాలని విజయనగరం మక్కా మసీద్ కమిటీ సభ్యులు మహ్మద్ ఆలీ అన్నారు.పవిత్రరంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మక్కామసీద్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మహారాజా ఆసుపత్రిలో నిరుపేద రోగులకు పండ్లపంపిణీ చేపట్టారు. విజయనగరం ప్రజలు శాంతికాములకు అని ,కలిసిమెలిసి జీవించడంలో ప్రథమ స్థానంలో ఉన్నారని తెలిపారు. ఆసుపత్రిలో రోగులంతా సంపూర్ణ ఆరోగ్యంతో ఇళ్ళకి వెళ్ళాలని ఆయన భగవంతుడని ప్రార్థించారు.మక్కా మసీద్ మౌలానా మహ్మద్ గుఫ్రాన్ ఆలీ మాట్లాడుతూ ప్రజలంతా ఒకటేనని ప్రపంచంలో అశాంతి రాజ్యమేలుతున్నాదని ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు కరవౌతున్నాయని దీనిని రూపుమాపడానికి అంతా సోదరభావం మెలగాలని కోరారు. ఈ కార్యక్రకమంలో మక్కామసీద్ కమిటీ సభ్యులు మహ్మద్ ఇస్మాల్, సయ్యద్ భాషా, ఫేక్ ఫియాజ్, యంగ్ లర్కస్ ఆఫ్ మక్కా మసీద్ సభ్యులు ఇమ్రాన్ షాహిద్, షబ్బర్, రెహ్మాన్, ఇజాజ్ సైఫ్ద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# నిత్యచైతన్య సాహితీ సవంతి సంస్కృత కళాశాల

## ప్రముఖ సాహితీవేత్త శ్రీపాద

విజయనగరం: నిత్యచైతన్య సాహితీ స్రవంతి సంస్కృత కళాశాల అని పాయకరావుపేటకు చెందిన ప్రముఖ సాహితీవేత్త శ్రీపాద సత్యనారాయణమూర్తి అన్నారు.

తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ 1860 నుండి నేటి వరకు ఎంతోమంది మహనీయుల పాదస్పర్శతో పవిత్రతను సంతరించుకున్న కళాశాలలో చదువుకోవాలంటే పూర్వజన్మ సుకృతం ఉండాలని, తాను ఇక్కడి పూర్వ విద్యార్థి గావడం తన అదృష్టమని అన్నారు. ఈ సందర్భంగా తెలుగు పద్యాలను చక్కగా పఠించారు. అనంతరం కళాశాల ప్రాచార్యులు డాక్టర్ పి.స్వప్నహైందవి, సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్‌లు శ్రీపాదను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ గిరిజా ప్రసన్న, స్వాతి, ప్రియాంక, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# 21న అంతర్జాతీయ సంగీత దినోత్సవ వేడుకలు

విజయనగరం : అంతర్జాతీయ సంగీతది నోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21వతేదీన ఎలయన్స్‌క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో కొత్త అగ్రహారం శారదా విద్యాపీఠ్‌లో వేడుకలను నిర్వహిస్తున్నామని ఎలయన్స్‌క్లబ్ గవర్నర్ సముద్రాల గురుప్రసాద్ అన్నారు. లంకవీధిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 21వ తేదీ ఉదయం 9 గంటల నుండి 3 గంటల పాటు సాంస్కృతికోత్సవం ఉంటుందని, ప్రముఖ సంగీత విద్వాంసులు మెహర్ లత, ఎస్ ఉషాకామేశ్వరిలకు 2018 సంవత్సరానికి గాను సంగీత దినోత్సవ పురస్కారాలను ప్రదానం చేయనున్నామని అన్నారు. అనంతరం సంగీత కచేరీ ఉంటుందని, వయోలిన్‌పై ప్రముఖ వాయులీన విద్వాంసురాలు కె.విజయలక్ష్మి, మృదంగంపై మండపాక నాగలక్ష్మి యొక్క శిష్యులు హృషీకేశం సహకరిస్తారని అన్నారు.సమావేశంలో తొలుత సంగీత దినోత్సవ ఆహ్వానప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ దక్షిణభారతదేశ కన్వీనర్ పెనుమజ్జి విజయలక్ష్మి, కేబినెట్ సెక్రటరీ పిన్నింటి సూర్యనారాయణ, వనితాక్లబ్ అధ్యక్షురాలు ఎం సుభద్రాదేవి, శారదా విద్యాపీఠ్ సాంస్కృతిక కార్యదర్శి సి.హెచ్. సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాతల దినోత్సవ వేడుకలు




విజయనగరం: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో ఛైర్మన్ కె ఆర్ డి ప్రసాదరావు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తాన్ని దానం చేయడం అంటే మరొకరి ప్రాణాలను కాపాడినట్టేనని, ప్రతీ ఒక్కరూ రక్తదానం చేయడం ద్వారా చక్కటి ఆరోగ్యాన్ని కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో తొలుత రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డ్యునాంట్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.

ఈ నేపథ్యంలో సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆద్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించి రక్తాన్ని దానం చేసారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి కెంగువ సత్యం,సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జోనల్ సెక్రటరీ గోపాలరావు, అధ్యక్షులు జి.చిరంజీవి, కనకాచారి, సూర్యారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీపీఐ నేతలు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి

## ఎంపీపీ సత్యనారాయణ



కొయ్యూరు : మండలంలొని అనేక గ్రామాల్లో ప్రస్తుతం జరుగుతున్న భూవివాదాలకు స్థానిక రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని, సిపిఐ నాయకులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని కొయ్యూరు ఎంపిపి గొలిసింగి సత్యనారాయణ ఆరోపించారు. మండలంలోని మర్రివాడ పంచాయతీ తళ్లపాలెం గ్రామంలో తమ పూర్వీకులకు సర్వే నెంబరు 14, 15 తేదీల్లో యు 6-80 సెంట్లు, విస్తీర్ణం గల డి.నమూనా పట్టా గల భూమి ఉందని, దీనిని నాలుగు తరాలుగా తమ కుటుంబీకులు గొలిసింగి రామన్నపడాల్, గొలిసింగి బాలయ్యపడాల్, జె.బాలమ్మ, అలాగే తన వరకు సాగు చేసుకుంటున్నామని తెలిపారు. అయితే భూమి సాగులో ఉన్నవారిని విస్మరించి రెవెన్యూ అధికారులు తాళ్లపాలెం గ్రామానికి చెందిన సోమెల లక్ష్మిపేరిట పట్టా మంజూరు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలా అడ్డదారిలో పట్టా మంజూరు చేయడంతోనే గ్రామంలో రెవెన్యూ అధికారులు పట్టాలు మంజూరు చేశారని, దీనిపై పార్టీలకతీతంగా ఆందోళనకు దిగుతామన్నారు. అధికార దుర్వినియోగానికి దిగి భూకబ్జాలకు పాల్పడ్డానని సిపిఐ నేతలు ఆరోపణలో చేయడం తగదన్నారు. తాళ్లపాలెంలోని భూవివాదానికి సంబందించి పూర్వాపరాలు తెలుసుకొని సిపిఐ నాయకులు మాట్లాడాలని సూచించారు.

# కృష్ణాపురంలో పొలం పిలుస్తుంది

యలమంచిలి రూరల్ : రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏఒ స్వప్న అన్నారు. గురువారం యలమంచిలి మండలం కృష్ణా పురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ఆమె పలు సూచనలు చేశారు. విత్తన శుద్ధి, విత్తనాలు వేయడం వివరించారు.

# గిరిజనాభివృద్ధికి సంయుక్తగా పనిచేయండి



విజయనగరం: దేశంలో 50 శాతం పైగా గిరిజనులు నివసించే అన్ని మండలాల్లో వారి సమ్మేళిత అభివృద్ధిపై అధికారులు సంపూర్ణ శ్రద్ధ చూపాలని భారత ప్రభుత్వ అండర్ సెక్రటరీ పి.కె.సాహు పేర్కొన్నారు. గురువారం ఉదయం దేశంలోని అన్ని గిరిజన సంక్షేమ ప్రాజక్టు అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈశాన్య రాష్ట్రాలతో సహ దేశంలోని అన్ని రాష్ట్రాలలో గిరిజనులు ఇతరులతో సమాన అభివృద్ధి చెదటానికి ఐటిడిఎ, గిరిజన సంక్షేమ అధికారులు ఇతర కీలక శాఖల అధికారులతో వారి అభివృద్ధికి సంయుక్త కృషి జరపాలని అన్నారు. విద్యారంగం, వైద్య, ఆరోగ్య రంగం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, సర్వశిక్ష అభియాన్, వయోజన విద్య మార్కెటింగ్, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, పశు సంవర్ధన శాఖ, నీటిపారుదల. గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీసరఫర, పంచాయితీరాజ్, జిల్లా పరిషత్, గృహ నిర్మాణం వంటి అనేక శాఖలు గిరిజన ప్రాంతాలలో వారి కనీస అభివృద్ధి తమ వంతు పాత్ర పోషించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లోపార్వతీపురం ఐటిడిఎ పి.ఓ డాక్టర్ లక్ష్మీశ, జయింట్ కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, భారత విపత్తుల వాఖ కార్యనిర్వాహక అధికారి బి.హెచ్.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సామూహిక దరఖాస్తుల సమర్పణ కార్యక్రమం పోస్టల్ విడుదల



కరపత్రాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

నాతవరం : అర్హులైన వారందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు, సాగు భూములు, తాగునీరు తదితర మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఈ నెల 18న తహశీల్దార్ కార్యాలయాల్లో ధరఖాస్తులు అందజేయడానికి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సామూహిక ధరకాస్తుల సమర్పణ అనే కార్యక్రమం చేపడుతున్నట్లు సిపిఐ మండల కార్యదర్శి డి.అజయ్‌బాబు అన్నారు. గురువారం నాతవరంలో సామూహిక ధరఖాస్తుల సమర్పణ కార్యక్రమ గోడపత్రులను ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం మేనిఫేస్టోలో అవసరమైనని పేదలందరికీ గృహాలు మంజూరుచేస్తానని ప్రకటించి నేటికీ నెరవేర్చలేదన్నారు. జన్మభూమి కార్యమ్రాల పేరిట ఆర్భాట ప్రచారాలు మినహా, గృహాలు కావాలని ధరఖాస్తుచేసిన వారికి నేటికీ మంజూరు చేయలేదని ఆయన ఆరోపించారు. అందుకే గ్రామాల్లో ఇళ్ళు అవసరమైన లబ్దిదారులంతా ఈ నెల 18న మండలకేంద్రంలో ఉన్న తాహసీల్దారు కార్యాలయాలనికి వస్తే, వ్యక్తిగతంగా ధరకాస్తులు రాసి, సామూహికంగా తహశీల్దార్‌కు అందజేయడం జరుగు తుంద న్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు పాల్గొన్నారు. .

# ప్రభుత్వ ప్రాథమిక విద్య పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలి

రావికమతం : ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం విద్యపట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోకపోతే ప్రాథమిక విద్య అంతరించే ప్రమాదం ఉందని పిఆర్‌టియు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సిహెచ్.తిరుపతి రావు అన్నారు. ప్రాథమిక పాఠ శాలల్లో 80పైబడిన విద్యార్థులున్న ప్రతీ ప్రాథమిక ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో 1.20 ఉపాధ్యాయుల విద్యార్థులు నిష్పత్తి ఉండాలన్నారు. ప్రతీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు ప్రహారీ గోడ తప్పనిసరిగా ఉండాలన్నారు. రన్నింగ్‌వాటర్ ఉండేలా చూడా లన్నారు. అన్ని పాఠశాలలకు సదరు మీడియంల పుస్తకాలను వెంటనే సర ఫరా చేయాలన్నారు. 20 మంది పైబడిన ప్రతీ పాఠశాలకు కనీసం ఒక ఉపాధ్యాయుడినైనా ఉండేలా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

20 మంది పైబడిన ప్రతీ పాఠశాలకు కనీసం ఒక ఉపాధ్యా యుడినైనా ఉండేలా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

# కేంద్రంతో తాడో పేడో తేల్చుకుందాం

రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న వైఖరిపై మండిపడ్డారు. పోలవరంలో డయాఫ్రం వాల్ విజయవంతంగా పూర్తి చేశామని, ఈ విషయంలో మన వాదనలు గట్టిగా వినిపించాల్సి ఉందన్నారు. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తర్వాత నిధుల విడుదలలో ఆలస్యం చేయడం సరికాదన్నారు. లెక్కలు చెప్పలేదనే నెపం రాష్ట్ర ప్రభుత్వంపై మోపటం సరికాదన్నారు. ప్రత్యేక హోదాకు గట్టిగా పట్టుబట్టాలని, ప్రత్యేక హోదా ఇస్తామని అంటేనే హైదరాబాద్‌ను వదులుకొని వచ్చినట్లు స్పష్టం చేశారు. కానీ కాలయాపన చేస్తూ అప్పుడిస్తాం, ఇప్పుడిస్తాం అని అన్యాయం జరిగిందని ప్రజలంతా భావిస్తున్నారని సీఎం తెలిపారు. ఇప్పుడు దక్షిణాదిలో ఆంధ్రప్రదేశ్ మిగిలిన రాష్ట్రాలతో సమానంగా అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. ఆదాయం వచ్చేదాకా కేంద్రం సహకరించాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. నాలుగేళ్లలో కేంద్రం సహకారం లేకపోయినా రాష్ట్రంలో 10.5శాతం వృద్ధి రేటు సాధించామన్నారు. విభజన సమస్యలపై ఈ సమావేశంలో చర్చించిన చంద్రబాబు అభివృద్ధికి సహకరించాలి తప్ప అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు. పన్నులు చెల్లిస్తున్నా న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన వాటిని కూడా కేంద్రం ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. పెద్ద నోట్ల రద్దు నిర్ణయం వల్ల నగదు లేక ప్రజలు కష్టాలు పడుతున్నారని, పెట్రోల్, డీజిల్ ధరలు దారుణంగా నియంత్రణ లేకుండా పెంచేసి వాటిపై ఒక్క పైసా తగ్గించి క్రూర పరిహాసం చేస్తారా? అని కేంద్రాన్ని నిలదీశారు.

# బీసీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

వివరించారు. అయితే వైకాపా అధినేత జగన్ మాత్రం తెదేపా హయాంలో బీసీలకు అన్యాయం జరుగుతోందని మాట్లాడటం బాధాకరమన్నారు. ఈ విషయంలో జగన్ బహిరంగ చర్చకు రావాలని.. వాస్తవాలు చెప్పేందుకు ఎప్పుడైనా, ఎక్కడైనా తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. చంద్రబాబును పేదల పక్షపాతిగా అభివర్ణించారు. ఈ సందర్భంగా కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ.. ధనవంతుల పిల్లలే కాకుండా పేదపిల్లలు కూడా బాగా చదువుకుని పైకి రావాలనేది చంద్రబాబు ఆకాంక్ష అన్నారు. రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దాలన్నదే చంద్రబాబు సంకల్పమని, అందులో అన్ని వర్గాలవారు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. విదేశీ విద్యాదీవెన పథకం కింద ఎంపికైన వారికి రూ.10లక్షలు చొప్పున ఆర్థిక సాయంతో పాటు వీసా, విమాన ఖర్చులు కూడా భరించనున్నట్లు తెలిపారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్రానికి మంచిపేరు తేవాలని లబ్ధిదారులకు సూచించారు.

# నిందితులకు జీవిత ఖైదు

గుంటూరు ఆటోనగర్‌లోని ఓ బ్లాస్ట్ ఫర్నేస్‌లో నాగవైష్ణవి శవాన్ని పడేశారు. ఎముకలు కూడా కరిగిపోయేలా మంట మండించి బూడిద చేశారు. బ్లాస్ట్ ఫర్నేస్ నుంచి నాగవైష్ణవి చెవిపోగులను సేకరించిన పోలీసులు వాటిని ఎఫ్ఎస్ఎల్‌కు పంపారు. చెవిపోగుకు వజ్రం ఉండడంతో అదే ఈ హత్య కేసులో కీలక సాక్ష్యంగా మారింది. కారు డ్రైవరు హత్య సమయంలో ప్రత్యక్ష సాక్షులు కూడా ఈ కేసులో వాంగ్మూలం ఇచ్చారు. అపహరించిన చిన్నారిని అత్యంత దుర్మార్గంగా హతమార్చారనే సంగతి బయటకు రావడంతో నాగవైష్ణవి తండ్రి పలగాని ప్రభాకర్ ఆ బాధను తట్టుకోలేక గుండెపోటుతో మరణించారు.

విజయవాడకు చెందిన పలగాని ప్రభాకరరావు వ్యాపారి. బీసీ నాయకుడు. ఉమ్మడి కుటుంబం. ప్రభాకర్‌కు నలుగురు సోదరులు, ముగ్గురు అక్కాచెల్లెళ్లు. సోదరి వెంకటేశ్వరమ్మకు వివాహం చేశాక కొంతకాలానికి ఆమె భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆమె కొడుకు, కుమార్తెను తీసుకుని సోదరుల వద్దకే వచ్చేసింది. సోదరి భర్త చనిపోవడం, తమ కుటుంబమే ఆసరా కావడంతో.. ఆమె కుమార్తెను ప్రభాకరరావు వివాహం చేసుకున్నాడు. వారికి ఆరుగురు మగపిల్లలు అంగవైకల్యంతో పుట్టి మృతిచెందారు. ప్రభాకరరావుకు పిల్లలంటే అమితమైన ఇష్టం. దీంతో కుటుంబ సభ్యులు మరో వివాహం చేయాలని ఆలోచించినప్పటికీ.. సోదరి వద్ద ఈ విషయం గురించి ప్రస్తావించలేకపోయారు. ఆ తర్వాత ప్రభాకరరావు సమీప బంధువైన నిజామాబాద్‌కు చెందిన నర్మదాదేవిని రెండో వివాహం చేసుకున్నారు. వారికి ముగ్గురు పిల్లలు కాగా అందులో ఇద్దరు మగపిల్లలు, ఒక పాప నాగవైష్ణవి.

***మరణ వార్త విని ఆగిన తండ్రి గుండె***

ప్రభాకకరావుకు రెండో వివాహం జరిగాక రెండు కుటుంబాల మధ్య స్పర్ధలు పెరిగాయి. నాగవైష్ణవి ఒక్కగానొక్క కుమార్తె కావడంతో ఆయనకు ఎనలేని ప్రేమ. ప్రభాకరరావు రెండో భార్య ఇంటివద్దే ఎక్కువ సమయం గడుపుతుండటంతో మెదటి భార్య, ఆమె సోదరుడు పంది వెంకట్రావు తరచూ ఆయనతో వాదనకు దిగేవారు. ఈ వివాదం జరుగుతున్న క్రమంలోనే 2010 జనవరి 30వ తేదీన కారులో పాఠశాలకు వెళ్తున్న చిన్నారి నాగవైష్ణవిని దుండగులు కిడ్నాప్ చేశారు. అడ్డువచ్చిన కారు డ్రైవర్ లక్ష్మణరావును హత్య చేశారు. నాగవైష్ణవి తిరిగి వస్తుందని ఆశగా ఎదురుచూసిన ఆ తల్లిదండ్రులు కన్నకూతురు ఇక లేదనే చేదు నిజం తెలిసి తల్లడిల్లిపోయారు. నాగవైష్ణవి మరణవార్త తెలిసిన వెంటనే తండ్రి ప్రభాకర్ గుండె ఆగిపోయింది.


***న్యాయం కోసం పోరాడుతూ అనంత లోకాలకు..***

ఈ కేసులో కుట్రదారుడైన పలగాని ప్రభాకరరావు బావమరిది పంది వెంకట్రావు గౌడ్, పాత్రధారులైన మోర్ల శ్రీనివాసరావు, యంపరాలు జగదీశ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఎ-1గా శ్రీనివాసరావు, ఎ-2గా జగదీశ్, ఎ-3గా వెంకటరావు గౌడ్‌ను చార్జిషీట్‌లో చేర్చారు. కన్నబిడ్డను, కట్టుకున్న భర్తను కళ్ళ ముందే కోల్పోయిన నాగవైష్ణవి తల్లి నర్మదాదేవి తీవ్ర మానసిక క్షోభను అనుభవించారు. ఈ కేసు విచారణ త్వరగా పూర్తిచేసి నిందితులకు శిక్ష పడేలా చూడాలని ప్రభాకర్ సోదరుడు సుధాకర్‌తో కలిసి న్యాయం కోసం పోరాడుతూ వచ్చారు. మానసికంగా కుంగిపోవడం, మరోవైపు బ్రెయిన్ క్యాన్సర్ రావడంతో గతేడాది ఆమె మరణించారు. నాగవైష్ణవి బాబాయి సుధాకర్ కూడా అనారోగ్యంతో కన్నుమూశారు.

# కడప ఉక్కు పరిశ్రమపై తప్పుడు ప్రచారం

సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌పై తెలుగుదేశం పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆయన మండిపడ్డారు. కడప స్టీల్ ప్లాంట్ సాధ్యం కాదని కేంద్రం అఫిడవిట్‌లో పేర్కొనలేదని... మెకాన్ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం కలిసి సాధ్యాసాధ్యాలపై నివేదిక ఇవ్వాల్సి ఉందని మాత్రమే చెప్పిందన్నారు. 2014లో సెయిల్, రాష్ట్ర అధికారులు పరిశీలించి ఉక్కు పరిశ్రమ ఏర్పాటు సాధ్యం కాదని నివేదిక ఇచ్చినా.. అమిత్ షా కృషితో పునః పరిశీలనకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు కన్నా వివరించారు. మెకాన్ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నివేదిక ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఎవరెన్ని దుష్ప్రచారాలు చేసినా కడపకు ఉక్కు పరిశ్రమ తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఎవరూ ప్రాణత్యాగాలంటూ నాటకాలు ఆడొద్దని.. హామీల అమలుకు భాజపా కట్టుబడి ఉందన్నారు. తెదేపా కావాలనే భాజపాపై తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.

# ముషారఫ్‌కు షాక్.. ఎన్నికల్లో పోటీకి దూరం



ఇస్లామాబాద్: పాకిస్థాన్ సుప్రీంకోర్టు మాజీ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్‌కు షాకిచ్చింది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించింది. ఇంతకుముందు షరతులతో కూడిన అనుమతి ఇచ్చినా.. కోర్టులో హాజరు కాని కారణంగా అసలు పోటీ చేయకూడదని ఆదేశించింది. పాకిస్థాన్‌లో జులై 25న ఎన్నికలు జరగనున్నాయి. గతంలో కోర్టు అనుమతించడంతో ముషారఫ్ తన నామినేషన్‌ను కూడా దాఖలు చేశారు. ఆయనపై జీవితకాల నిషేధం విధించిన పెషావర్ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరుపుతున్నది. ఇదే కేసుకు సంబంధించి జూన్ 13లోపు కోర్టుకు హాజరు కావాలని ఆదేశించింది. అయితే ముషారఫ్ మాత్రం హాజరు కాలేదు. బుధవారం దీనిపై విచారణ జరిపిన చీఫ్ జస్టిస్ సాఖిబ్ నిసార్.. ముషారఫ్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయనకు మరో అవకాశం ఇచ్చి గురువారం మధ్యాహ్నం రెండు గంటల లోపు హాజరు కావాలని ఆదేశించారు. అయితే ముషారఫ్ తిరిగి రావాలని అనుకుంటున్నా.. ఇంత త్వరగా కుదరదని ఆయన తరపు లాయర్ ఖమర్ అఫ్జల్ వాదించారు. రంజాన్ పండుగతోపాటు అనారోగ్య కారణంగా ఆయన రాలేకపోతున్నారని, మరింత సమయం కావాలని కోరారని

అఫ్జల్ కోర్టుకు చెప్పారు. దీంతో చీఫ్ జస్టిస్ తీవ్ర అగ్రహం వ్యక్తం చేస్తూ విచారణను నిరవధికంగా వాయిదా వేశారు. పిటిషనర్ ఎప్పుడు సిద్ధంగా ఉంటే అప్పుడే విచారణ జరుపుతానని స్పష్టంచేశారు. అదే సమయంలో ముషారఫ్ ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించారు. ముషారఫ్ 2016, మార్చి నుంచి దుబాయ్‌లోనే ఉంటున్నారు. తన హయాంలో దేశంలో ఎమర్జెన్సీ విధించిన కారణంగా దేశ ద్రోహం కేసు ఎదుర్కొంటున్నారు.

# విజయభాను సంపాదకీయం

## ధర్నా.. నిరవధిక నిరాహార దీక్ష

ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్న ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం మళ్ళా సంక్షోభంలో పడ్డది. లెఫ్టినెంట్ గవర్నర్ సహకరించడం లేదంటూ ఏకంగా ఆయన కార్యాలయం ముందు ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మరో ముగ్గురు మంత్రులు ధర్నా ప్రారంభించారు. కొన్ని నెలలుగా ఐఏఎస్ అధికారులు సహాయ నిరాకరణ చేస్తున్న నేపథ్యంలో సమస్య పరిష్కరించుకోవడానికి కేజ్రీవాల్ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బాయిజల్ కార్యాలయానికి వచ్చారు. అయితే వీరిని కలుసుకోవడానికి లెఫ్టినెంట్ గవర్నర్ నిరాకరించడంతో వారు మూడు రోజులుగా వెయిటింగ్ రూమ్‌లోనే ధర్నా ప్రారంభించారు. ఆ తర్వాత నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. ఫిబ్రవరిలో చీఫ్ సెక్రటరీపై తనపై దాడి జరిగిందని ఆరోపించారు. ఈ ఉదంతం తరువా త ఐఏఎస్ అధికారులు మంత్రుల సమావేశాలకు హాజరుకావడం లేదని, ఫోన్‌కాల్స్ స్వీకరించ డం లేదని ముఖ్యమంత్రి కేజ్రీవాల్, మంత్రులు ఆరోపిస్తున్నారు. చట్టప్రకారం ఐఏఎస్ అధికారులు సమ్మె చేయకూడదని, దీనివెనుక కేంద్రం హస్తం ఉన్నదని వీరు తప్పుపడుతున్నారు. తాము సమ్మె చేయడం లేదని ఐఏఎస్ అధికారులు అంటున్నారు. అయితే ముఖ్యమంత్రి, మం త్రుల సమావేశాలకు హాజరుకావడం లేదని అంగీకరిస్తున్నారు. ఐఏఎస్ అధికారులు యథావిధిగా పనిచేస్తున్నారని, వారితో సత్సంబంధాలు నెలకొల్పుకోవడం ముఖ్యమంత్రి బాధ్యత అని లెఫ్టినెంట్ గవర్నర్ అంటున్నారు. కేజ్రీవాల్ ఒకప్పుడు ప్రభుత్వాధికారిగా ఉండి రాజకీయ నాయకుడిగా మారారు. ఆయనకు మిగతా రాజకీయ నాయకులతో పోలిస్తే, ప్రభుత్వాధికారులతో వ్యవహరించడం తెలువదని అనుకోలేం. అయినా ఈ సమస్య ఎందుకు వచ్చిందనేది పరిశీలించవలసి ఉన్నది. ఐఏఎస్ అధికారులతో గొడవ మధ్యలో తలెత్తింది కానీ, అదే అసలు సమస్య కాదు. అసలు సమస్య ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న అధికారాలకు సంబంధించినది. ఢిల్లీ ప్రభుత్వాన్ని పనిచేయకుండా కేంద్రం అవరోధాలు కల్పిస్తున్నదనేది కేజ్రీవాల్ ఆరోపణ. లెఫ్టినెంట్ గవర్నర్ కూడా సాధారణ ఫైళ్ళను పంపిస్తున్నప్పటికీ, విధానపరమైన ఫైళ్ళను తమవద్దనే పెండింగ్‌లో పెడుతున్నారని కేజ్రీవాల్ అంటున్నారు. ఈ మొత్తం వివాదంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరు మరింత బాధ్యతారహితంగా ఉన్నది. కేంద్రంలోని ప్రభుత్వం కూడా ప్రజలు ఎన్నుకున్నదే కనుక ఢిల్లీ రాష్ట్రాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా పాలించవచ్చునని కేంద్రం సుప్రీంకోర్టు ముందుచేసిన వాదన హాస్యాస్పదంగా ఉన్నది. ఇదే తర్కంతో కేంద్రం రేపు ఏ రాష్ట్ర ప్రభుత్వాన్నయినా పక్కనపెట్టి తానే పాలించవచ్చు. ఈ వాదన సమాఖ్య సూత్రాలకే విరుద్ధం. చట్టం ప్రకారం ఢిల్లీ రాష్ట్రం కాదనీ, లెఫ్టినెంట్ గవర్నర్‌కు పూర్తి అధికారాలున్నాయని వాదించడం, ప్రజా ప్రభుత్వం పట్ల గౌరవం లేకపోవడమే. కేంద్రానికి లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా పూర్తిగా పరిపాలించే అధికారం ఉందని అనుకుందాం. చట్టప్రకారం లెఫ్టినెంట్ గవర్నర్‌కు అన్ని అధికారాలు ఉండవచ్చు. అయినంత మాత్రాన ప్రజల ద్వారా ఎన్నికైన ప్రభుత్వాన్ని అడుగడుగునా అడ్డుతగులడం ప్రజాస్వామిక సూత్రాలకు విరుద్ధం. ముఖ్యమంత్రి కేజ్రీవాల్ నిరసనకు రాష్ట్రీయ లోక్‌దళ్, రాష్ట్రీయ జనతాదళ్, మాజీ కేంద్ర మంత్రి యశ్వంత్ సిన్హా తదితరుల నుంచి మద్దతు లభించింది. కానీ కాంగ్రెస్‌పార్టీ మాత్రం బీజేపీ వాదనతో ఏకీభవించడం ఆశ్చర్యకరం. ఢిల్లీ దేశ రాజధాని కనుక పూర్తిస్థాయి అధికారాల బదలాయింపు చేయకుండా, కేంద్రం వద్ద అధికారాలు పెట్టడంలోని ఔచిత్యాన్ని అర్థం చేసుకోగలం. కానీ ఈ అధికారాలను కేంద్రం కానీ, లెఫ్టినెంట్ గవర్నర్ కానీ ఆచితూచి వాడుకోవాలె. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాల్లో, విధానాల్లో ఏవైనా ప్రమాదకర పోకడలు ఉంటే చర్చించాలె. కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య లెఫ్టినెంట్ గవర్నర్ సమన్వయం సాధించాలె. కానీ ప్రజా ప్రభుత్వాన్ని పని చేయనీయకుండా అవరోధాలు కల్పించడం తగదు. కేంద్ర పాలిత ప్రాంతాల్లో కానీ, రాష్ట్రాల్లో కానీ ప్రజాస్వామీకరణ వైపు నడకసాగాలె కానీ, ప్రజా ప్రభుత్వాన్ని నిరర్థకంగా మార్చకూడదు. ఢిల్లీలో ఇంత రగడ జరిగినా కేంద్రం పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నది. లెఫ్టినెంట్ గవర్నర్ ఇంత మొండిగా వ్యవహరిస్తున్నాడంటేనే, దీనికి కేంద్రం మద్దతు ఉందన్నట్టు. కేంద్ర, రాష్ట్రాల్లో వేర్వేరు పార్టీలు అధికారంలో ఉన్నంత మాత్రాన, రాష్ట్ర ప్రభుత్వాన్ని పనిచేయకుండా అవరోధాలు సృష్టించడం, సంక్షోభం సృష్టించడం చర్యలు భారత్ వంటి పరిణత ప్రజాస్వామ్య వ్యవస్థలో జరుగడం అవాంఛనీయం. కేంద్రం సూచనలు ఇస్తే తప్ప లెఫ్టినెంట్ గవర్నర్ చలించడనేది స్పష్టం. ఈ పరిస్థితుల్లో ఈ సంక్షోభాన్ని పరిష్కరించే బాధ్యత కేంద్రంపైనే ఉన్నది. చట్టం, నిబంధనలు ఏమి చెబుతున్నా అధికారాలు ఇవ్వడమే ఈ సమస్యకు పరిష్కారం.

# మహిళల రక్షణలో టీడీపీ, బీజేపీలు విఫలం

విశాఖపట్నం: టీడీపీ, బీజేపీ నాలుగు సంవత్సరాల పాలనలో మహిళల పరిస్థితి ప్రమాదకరంగా మారిందని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడురోజులు పాటు ఐద్వా నగర కమిటీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీలో జరుగుతున్న యువతుల శిక్షణా కార్యక్రమం సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు డ్వాక్రా మహిళలకు లక్ష రూపాలయ రుణమాఫీ చేస్తామని, మద్యం నియంత్రణ దిశగా చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారన్నారు.

రకరకాల పథకాలు పెట్టి మహిళలను మోసం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, ఆర్.యన్.మాధవి, బి.సూర్య మణి, సుమిత్ర, ఎం.సుజాత, కె.నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

# లోకేశ్వరి హత్యకు కారకులైన వారిని తక్షణం అరెస్టు చేయాలి



విశాఖపట్నం : కొటవురట్ల మండలం బి.కె.పల్లికి చెందిన 13 సంవత్సరాల లోకేశ్వరిపై హత్యాయత్నం చేసి ఆమె తీవ్ర అనారోగ్యం పాలౌవడానికి కారకులైన నింధితులను తక్షణమే అరెస్టు చేయాలని, నింధితులకు కొమ్ముకాసి కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్న కోటవురట్ల ఎస్ఐను తక్షణమే సస్పెండ్ చేయాలని ఐద్వా ఎపి రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తుంది. బాధితరాలను మైక్యూర్ హాస్పటల్‌కు ఐద్వా ఎపి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి, నగర నాయకులు సిహెచ్.సుమిత్ర, జి.ప్రియాంకగార్లు పరామర్శించారు. డాక్టర్‌ను సంప్రదించగా ఆమె చిన్న మెదడు పూర్తిగా దెబ్బతిన్నదని చెప్పారు.ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ జూన్ 10న జరిగిన ఈ తీవ్రమైన సంఘటన పట్ల స్థానిక పోలీసుల వ్యవహారం అత్యంత అన్యాయంగా వుందన్నారు. స్థానిక ఎస్ఐ, సిఐ కనీసం ఇంత వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం నిందితులకు కొమ్ముకాయడమేనన్నారు. తక్షణమే ఎస్పి కల్పించుకొని నిజాయితీ కలిగిన పోలీసు ఆఫీసర్స్‌ను ఈ కేసు నిమిత్తం కేటాయించాలని డిమాండ్ చేశారు. బాధితరాలు ఆరోగ్య పరిస్థితి విషమంగా వున్నందున వైద్యం నిమిత్తం అత్యాధునిక వైద్యసేవలు అందించాలని, కలెక్టర్ గారు జోక్యం చేసుకొని ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి బాధితరాల వైద్య ఖర్చులు భరించాలని డిమాండ్ చేశారు.

బాధితరాలు అక్క ఫోటోలను సోషల్ మీడియాలో అసభ్యంగా మార్ఫింగ్ చేస్తున్న వారిని ప్రశ్నించినందుకు, ఫోటోలను వెనక్కి ఇవ్వమని అడిగినందుకు బాధితరాలుపై హత్యాయత్నం జరిగిందన్నారు. బాధితరాలకు, నిందితులు దగ్గర బంధువులు మరియు రాజకీయంగా పలుకుబడి కలిగినవారు కావడం వలన పోలీసులు కేసును నీరుగార్చేప్రయత్నం చేశారన్నారు.

# ముగ్గురు మావోయిస్టులు లొంగుబాటు



కొయ్యూరు : మండలంలో బూదరాళ్ల పంచాయతీ కునుకూరు గ్రామానికి చెందిన ముగ్గురు మావోయిస్టు మిలీషియా సభ్యులు లొంగిపోయారని కొయ్యూరు సిఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. బూదరాళ్ల పంచాయతీ కునుకురు గ్రామానికి చెందిన వంతల కామేశ్వరరావు (35), గెమ్మెలి సలుపు(25), వంతల పూయ(45) సభ్యులు మంప పోలీసు లకు లొంగి పోయారన్నారు. ఆ ముగ్గురు మిలీ షియా సభ్యులు భోజనాలు సమకూర్చడం, ప్రజలను మీటింగ్‌లకు తీసుకు రావడం, మావోయిస్టు దళాలతో చుట్టుపక్కల గ్రామాలకు తిరగడం వంటి కార్యక్రమాలు చేసేవారన్నారు. మావో యిస్టులు ఆజాద్, జాంబ్రి, ఆనంద్, శరత్‌లు బలవంతం చేయడంతో వీరికి సహక రించారన్నారు. అయితే ఇప్పుడు దళంలో సభ్యులు చనిపోవడంతో పాటు ఆరోగ్యం బాగోకపోవడంతో పాటు ప్రభుత్వం నుండి అన్ని సంక్షేమ పథకాలు అందుబాటులో రావడంతో ఆకర్షితులై పోలీసుల ముందు లొంగిపోయినట్లు సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో మంప ఎస్సై శ్రీనివాసరావు సిబ్బంది ఉన్నారు.

# గ్రామాలు అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

### టీడీపీ ఉపాధ్యక్షులు ఎంవివి.ప్రసాద్



మాట్లాడుతున్న టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు ఎంవివి.ప్రసాద్

కొయ్యూరు : గ్రామాలు అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమని జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు ఎంవివి.ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక జెడ్‌పిటిసి అతిధి గృహంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లోటుబడ్జెట్ ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారన్నారు. రూ.200 ఉండే పింఛన్ రూ.1000కు చేశారన్నారు. చంద్రన్న బీమా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం నిరుద్యోగ భృతి కూడా ఇస్తున్నారన్నారు. గ్రామాలు అభివృద్ధి జరగాలంటే టిడిపితోనే సాధ్యమన్నారు. రానున్న రోజుల్లో టిడిపి గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు ఇప్పటి నుంచే అహర్నిశలు పని చేయాలన్నారు. ఎన్నికలు దగ్గరపడు తుండటంతో గ్రామ గ్రామాలకు వెళ్లి పార్టీ చేస్తున్న అభివృద్ధి పథకాలను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొలిసింగి సత్యనారాయణ, జెడ్‌పిటిసి శ్రీరామ్మూర్తి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె.ఖాన్, మండల అధ్యక్షులు కొర్రు రామ్మూర్తి, పల్లి కృష్ణంనాయుడు, భాస్కరరావు, 33 పంచాయతీల్లోని కార్యకర్తలు పాల్గొన్నారు.

# కవి సమయం

## వ్యాసుడు వర్ణించిన వేద క్రమము

బ్రహ్మ ఒకనాదం పుట్టింది మొట్టమొదటిగా. నాదాన్ని ఉపాసించడం వల్ల యోగుల పాపాలు తొలుగుతాయి. ముక్తి పొందుతారు. ఆ నాదంతో ఓంకారం పుట్టింది. ఆ ఓంకార నాదమే సర్వమంత్రాలకు, ఉపనిషత్తులకు మూలభూతం. ఓంకారానికి మూడు గుణాలుంటాయి. అదే అకార, ఉకార, మకారాలు. మూడు వర్ణాల రూపం అదే. బ్రహ్మ ఆ ప్రణవం నుండి స్వరం, అంతస్థం, ఉష్మం అనే మూడు లక్షణాలతో అక్షర సమామ్నాయాన్ని కల్పించాడు. వాటి సహాయంతో బ్రహ్మ తన నాలుగు ముఖముల నుండి నాలుగు వేదాలు సృష్టించాడు.

తరువాత బ్రహ్మ ఉపదేశించిన రీతిగా బ్రహ్మవాదులు (బ్రహ్మపుత్రులు) వేదాలను నేర్చుకుని అదే క్రమంలో వారు కూడ తమ శిష్యగణానికి బోధించారు. యీ విధంగా ప్రతి యుగంలను వేదాలు సమగ్రంగా మహర్షులచే అభ్యసించబడ్డాయి. వేదాల చదవలేనివారికి సహాయంగా ద్వాపర యుగంలో మొదట్లో సత్యవతికి పరాశరమహర్షికి భగవంతుడు కొడుకై పుట్టాడు.

...సశేషం...

...కవితా రచన
స్వామి అప్పాజి భగవాన్
సెల్ నెం: 98486 44336

# పంచాంగం

| మాసం : నిజ జ్యేష్ఠ ; తిథి : విదియ రా.9.22; ఆరుద్ర మ.2.28; రా.వ.1.39ల 3.08. | శుక్రవారం 15-06-2018 |
|---|---|

**మేషం** : ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. మీ ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చుతాయి. భాగస్వామిక చర్చలు, సంప్రదింపులకు అనుకూలం. స్త్రీలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. శాస్త్ర రంగాల వారికి పరిశోధనలు, ప్రయోగాలకు మంచి గుర్తింపు లభిస్తుంది. మీ వాహనం, విలువైన వస్తువులు జాగ్రత్త. గృహ నిర్మాణాలు, మరమ్మతులకు అనుకూలం.

**వృషభం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు.ఉద్యోగస్తులు సమర్థంగా పనిచేసి పై అధికారులను మెప్పిస్తారు. ఒక కార్యం నిమిత్తం ఆకస్మికంగా ప్రయాణం చేస్తారు. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది.

**మిథునం** :ఎల్ఐసి, పోస్టల్ ఏజెంట్లు, రిప్రజెంటేటివ్‌లు టార్గెట్‌లను అధిగమిస్తారు. ఉపాధ్యాయులకు, రిప్రజెంటేటివ్‌లకు సదవకాశాలు లభిస్తాయి. స్త్రీలకు ఆరోగ్యంలో అధికమైన జాగ్రత్త అవసరం.

**కర్కాటకం** : స్థిరాస్తుల అమ్మకానికై చేయు యత్నాలు వాయిదాపడతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో అప్రమత్తత అవసరం. విద్యార్థులకు మిత్ర బృందాలు, వ్యాపకాలు అధికం కాగలవు. దీర్ఘ కాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కారమవుతాయి. అంతగా పరిచయం లేని వ్యక్తులకు దూరంగా ఉండటం మంచిది.

**సింహం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపా రాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కాన వస్తుంది.

**కన్య** : ధనసహాయం చేసే విషయంలో అప్రమత్తత అవసరం. దైవ దర్శనాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఉద్యోగస్తులు ఓర్పు, నేర్పుతో విజయాన్ని సాధించగలరు. మధ్యవర్తిత్వం వహించటం వల్ల మాటపడక తప్పదు. మార్కెటింగ్ రంగాల్లో ఒత్తిడి పెరుగుతుంది. పాత వస్తువుల వల్ల ఇబ్బం దులు తలెత్తుతాయి.

**తుల** : నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాల్లో నిల దొక్కు కుంటారు. జీవితభాగస్వామి ద్వారా ఆర్థిక లాభం పొందుతారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సామాన్యం. ప్రముఖుల కలయిక వల్ల ఆశించిన ఫలితం ఉంటుంది. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు, బిల్డర్లకు స్వీయ పర్యవేక్షణ ముఖ్యం.

**వృశ్చికం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ అంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారి తీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. కొంతమంది మీ నుంచి ధనం లేక ఇతర్రతా సహాయం అర్థిస్తారు. ముఖ్యుల రాకపోకలు అధికం అవుతాయి.

**ధనుస్సు** : వృత్తి వ్యాపారులకు అన్నివిధాలా అనుకూలం. కీలకమైన సమస్యలు పరిష్కారం కావటంతో మీలో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. కుటుంబీకుల కోరికలు తీరుస్తారు. చేపట్టిన పనులు ఆశించినంత చురుకుగా సాగవు. భాగస్వామిక చర్చల్లో మీ అభిప్రాయాలకు ఆమోదం లభిస్తుంది. ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు.

**మకరం** : ఒక కార్యం నిమిత్తం ప్రయా ణం చేస్తారు. పత్రికా సంస్థల లోని వారికి ఊహించని సమస్యలెదురవుతాయి. దంప తుల మధ్య చిన్న చిన్న కలహాలు, చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. డాక్టర్లు అరుదైన చికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. సభలు, సమావేశాల్లో చురుకుగా పాల్గొంటారు.

**కుంభం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ అంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారి తీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి.

**మీనం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది.

# యువ ఎంపీకి కీలక బాధ్యతలు దక్కబోతున్నాయా ..?



శ్రీకాకుళం : వెనుకబడిన జిల్లాగా పేరు పొందిన శ్రీకాకుళం జిల్లాలో రాజకీయ చైతన్యం బాగా ఎక్కువ. మొదటి నుంచి టీడీపీకి కంచుకోటగా ఈ జిల్లా ఉంటూ వస్తోంది. స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు ఉన్నంతకాలం టీడీపీ ఒక వెలుగు వెలుగుతూనే ఉంది. ఆ తరువాత పరిణామాలు కొంచెం మారినట్టు అనిపించినా టీడీపీకి ఇక్కడ జరిగిన నష్టం అయితే ఏమీ కనిపించలేదు. ఎన్టీఆర్ పార్టీ పెట్టిన నాటి నుంచి ప్రతీ ఎన్నికల్లోనూ జిల్లా వాసులు సైకిల్ పార్టీకి పట్టం కడుతూనే ఉన్నారు .

ప్రస్తుతం మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో టీడీపీకి కొంచెం ఆందోళన కలిగించే అంశాలు కలవరపెడుతున్నాయి. అందుకే అధినేత చంద్రబాబు రంగం లోకి దిగి పార్టీని చక్కబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో సీనియర్ నాయకులుగా పేరున్న కళా వెంకట్రావ్ పార్టీ అధ్యక్షుడిగా, మంత్రిగా ఉన్నప్పటికీ ప్రజాక్షేత్రానికి దూరమవుతున్నారన్నటాక్ వినిపిస్తోందట. ఇక ఉత్తరాంధ్ర పెద్దన్న సోదరుడు, అసెంబ్లీలో ప్రత్యర్థుల పై మాటలతో విరుచుకుపడే అచ్చెన్నాయుడు కూడా గ్రిప్ సంపాదించలేకపోయారు. జిల్లాలో సీనియర్ నాయకుడిగా, స్వాతంత్ర సమరయోధుడి వారసుడిగా, ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్న గౌతు శ్యామసుందర శివాజీదీ అదే పరిస్థితి. ప్రభుత్వ విప్ గా వ్యవహరిస్తున్న కూన రవికుమార్ సైతం ఎప్పుడూ లెక్కలతో సరిపెడుతూ తన రూటే సెపరేటనేలా వ్యవహరిస్తున్నారట. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే జనంలోకి వెళ్లలేకపోతున్నాడని విమర్శలు వినిపిస్తున్నాయి. నరసన్నపేట ఎమ్మెల్యే రమణ మూర్తికి ఈసారి టికెట్ రాదని టీడీపీ శ్రేణులే చెప్పుకుంటున్నాయి. శ్రీకాకుళం ఎమ్మెల్యే లక్ష్మీదేవి వయసు మీద పడటం ప్రతిబబంధకంగా మారింది. పాత పట్నం ఎమ్మెల్యే పార్టీ మారినా ప్రజల్లో దూసుకెళ్లలేకపోతున్నారు. ఇలా .. జిల్లాలో ఏ ఒక్క ఎమ్మెల్యే పరిస్థితి అంత అనుకూలంగా లేకపోవడం ఒకెత్తయితే.పదేళ్ల తర్వాత ఒక్కసారిగా అధికారంలోకి రావడంతో ప్రజల బాగోగులు అంతగా పట్టించుకోవడం లేదని జిల్లా ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందట.

జిల్లాలో ఉన్న మిగతా నేతల కంటే కాస్తో..కూస్తో.వ్యతిరేకత తక్కువ ఉండి.ప్రజల్లో పేరు సంపాదించుకున్న నాయకుడిగా ఎంపీ రామ్మోహన్ నాయుడు గుర్తింపు పొందారు.

ఓ వైపు తండ్రి వారసత్వంతో ఎంపీగా ఢిల్లీలో అడుగుపెట్టినా తనదైన శైలిలో జిల్లా వాసులను ఆకట్టుకోగలిగాడు ఈ యువ ఎంపీ. దీనికి తోడు మొన్నామధ్య లోకేష్ బాబు సీతంపేట పర్యటన, ముఖ్యమంత్రి సారవకోట పర్యటనల్లో స్టేజ్ మీద తన స్పీచ్ తో అటు ప్రజలను ఇటు అధినేతను ఆకర్షించగలగడంతో పాటు, హోదా పోరాటంలో తనదైన ముద్ర వేసుకోగలిగారు. ఎవరి బలాబలాలు ఎంత అనే విషయమై పూర్తిగా తన సొంత మనుషులతో సర్వే చేయించుకున్న బాబు, జనాల్లో ఉన్న వ్యతిరేకతను తొలగించుకునేందుకు పక్కాగా ప్రణాళికలను సిద్ధం చేసేసుకుంటున్నారట ఇందులో భాగంగానే సిక్కోలు నుంచే ఈ ప్రక్షాళన మొదలెట్టాలని భావిస్తున్నారట . ఇందుకోసం ప్రజల్లో వ్యతిరేకత లేని వ్యక్తి కోసం అన్వేషించిన బాబుకి ఏకైక అస్త్రంగా ఎంపీ రామ్మోహన్ నాయుడే కనిపించారట. త్వరలోనే ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించే సూచనలు ఉన్నాయని బాబు సన్నిహితులు చెప్తున్నారు

# ప్లాస్టిక్ నిషేధంపై సమావేశం



యానాం: నియోజకవర్గంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకంపై వాటి నివారణకు తీసుకోవలసిన అంశాలపై పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు సమావేశం నిర్వహించి చర్చించారు.

గురువారం ఉదయం స్థానిక పరిపాలనాధికారి కార్యాలయం యానాంలోని వర్తక సంఘసభ్యులతో సమావేశం నిర్వహించి ప్లాస్టిక్ బ్యాగ్‌ల వినియోగం తగ్గించాలని క్లాత్ సంచులు వాడాలని పర్యావరణానికి తీవ్ర విఘాతంగా మారిన ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు వ్యాపారులు సహకరించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యహరించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. ఏవైన సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ జి గౌరీసరోజ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రవిచంద్రన్, వర్తకసంఘ నాయకులు నల్లా వెంకన్న, మాజేటి సత్యభాస్కర్, కె. గోపాలకృష్ణ, బాబి, సూరిబాబు, పలువురు వర్తకలు తదితరుల పాల్గొన్నారు.

# విద్యాసంస్థలపై ఫిర్యాదుల సేకరణకు కంట్రోల్ రూం

యానాం : పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలు విద్యాసంస్థల గురించి విద్యార్థుల తల్లిదండ్రుల ఇచ్చే ఫిర్యాదుల సేకరణకు విద్యాశాఖ కంట్రోల్ రూంను ఏర్పాటు చేస్తుంది. మంచి అవకాశం వచ్చిన విద్యార్థికి టిసి ఇవ్వడానికి రూ. 2 లక్షల మొత్తాన్ని ఒక విద్యా సంస్థ డిమాండ్ చేయగా ఈ వ్యవహారం పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడి దృష్టికి వెళ్ళింది దీంతో అధిక మొత్తం రుసుంలు, డొనేషన్లు వసూలుచేసే విద్యాసంస్థలపై ఫిర్యాదుల సేకరణకు కంట్రోల్ రూంను ఏర్పాటుచేయాలని కిరణ్‌బేడి ఆదేశించారు. ఈ వ్యవహారంపై విద్యాశాఖ డైరెక్టర్ ప్రత్యేక ఫోన్ నెంబర్లతో కంట్రోల్ రూంను ఏర్పాటుచేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# తే.దే.పా. ప్రచారానికి పాదయాత్ర మాజీ ఎమ్మెల్యే బొడ్డు

పెద్దాపురం: తేదేపాను బలోపేతం చేయ్యాలన్న ఉద్దేశ్యంతో త్వరలో పెద్దాపురం నియోజకవర్గంలో త్వరలో పాదయాత్ర ప్రారంభించ గలనని మాజీ ఎమ్మెల్యే బొడ్డు భాస్కర రామారావు అన్నారు. తేదేపి మాజీ కౌన్సిలర్ రెడ్డి లక్ష్మీ అనారోగ్యంతో వైద్య సేవలు పొంది స్వగృహానికి వచ్చిన సందర్భంగా బొడ్డు ఆమెను పరామర్శించారు. ఈ పాదయాత్రలో పాత తరం పార్టీ కార్యకర్తలు, నాయకులను కలుసుకొని ముందుకుసాగుతానని తెలిపారు. ఈ సమావేశంలో పప్పల రామకృష్ణ, పాగా సురేష్, గోకిన ప్రభాకరరావు, ఎంఎల్ ఆలీ, తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మికులను కూలీలుగా మార్చకండి

పెద్దాపురం : బాల కార్మికులను పనులలో పెట్టి వారిని కూలీలగా మార్చితే చట్టప్రకారం చర్యలు తప్పవని కార్మికశాఖ సహాయ అధికారి అన్నారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ప్రభుత్వ చర్యలు తీసుకున్నదని, పిల్లలను ఎట్టి పరిస్థితులలోను పనులలో పెట్టి వారి జీవితాలను పాడు చేయవద్దని, బాలకార్మికులను పాఠశాలలకు తప్పనిసరిగా పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ ప్రభాజీ, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# భీమిలి జోనల్ పరిధి వార్డులలో జోనల్ కమిషనర్ పర్యటన



భీమునిపట్నం : భీమిలి జోనల్ కార్యాలయం పరిధిలో వున్న 1,5,6, వార్డులలో జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు పర్యటించారు. వార్డులలో రోడ్లపైన, కాలువల్లో వున్న చెత్తలను మరియు రోడ్డకి ఇరువైపులా గల భవన డెబ్రిస్‌ను ఎప్పటికప్పుడు తొలగించవలసిందిగా పారిశుద్య శానిటరీ ఇన్ స్పెక్టర్‌కు మరియు సిబ్బంది టౌన్ ప్లాన్ అధికారులను అదేశించారు. అలాగే మొన్న చిట్టివలసలో డెంగ్యూ వ్యాధితో మరణించిన వారి కుటుంభ సభ్యులను పరామర్శించారు.

అ ప్రాంతంలో పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టవలిసిందిగా సంబంధిత పారిశుద్య పనులు ఎప్పటికప్పుడు తొలగించవలసిందిగా పారిశుద్య శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు మరియు సిబ్బందిని హెచ్చరించారు.

# కాలుష్య పరిశ్రమలకు ఎలా అనుమతిచ్చారు

తాళ్లరేవు: నిత్యం ప్రయాణికుల రద్దీతో ఉన్న ప్రధాన రోడ్డుమార్గాలలో కాలుష్య వర్థాలను వెదజల్లుతున్న ఆక్వా పరిశ్రమలకు అధికారులు ఎలా అనుమతులిచ్చారని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. 216 జాతీయ రహదారిని ఆనుకొని సుబ్బారాయుడు దిమ్మ, గుడ్డివాని తూము, కొరంగి స్మశాన వాటిక సమీపంలో పలు ఆక్వా రొయ్యల పరిశ్రమల నుండి అనునిత్యం కాలుష్య వ్యర్థాలను వెదజలుతు భరించలేని దుర్గంధం వెలవడుతుందని మనుషుల ప్రాణాలతో చెలగాటంఆడే ఈ పరిశ్రమలకు అనుమతులు ఇవ్వవచ్చునా అని ప్రశ్నించారు. అధికారులు అవినీతికి పాల్పడి వీటికి అనుమతిచ్చినట్లు కనిపిస్తుందని ఆరోపించారు. ఊరికి దూరంగా ఉండవలసిన ఈ పరిశ్రమలను ప్రధాన జాతీయ రహదారిలో ఏర్పాటుచేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ రోడ్డు మార్గంలో వచ్చే ప్రతిఒక్కరూ ముక్కుమూసుకొని వెళ్ళవలసిన దుస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ పరిశ్రమలను తక్షణం అక్కడ నుండి గ్రామాలకు దూరంగా తరలించేలా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని అలాగే అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పర్యవరణానికి తీవ్ర విఘాతంగా మారిన ఈ పరిశ్రమలు దుర్గంధం వెదజల్లకుండా తీసుకోవలసిన చర్యలను సంబంధిత అధికారుల సత్వరం చేపట్టాలన్నారు. ఈ పరిశ్రమల ఉన్న చోట నిత్యం రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# శ్రీ గౌతమి ఆక్వా ఇండస్ట్రీస్‌ను ప్రారంభిచిన యనమల.కృష్ణుడు



అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరం రైల్వేస్టేషన్ రోడ్ ఇండియన్ బ్యాంక్ ఎదురుగా శ్రీ వెంకట సత్యసాయి ఎంటర్‌ప్రైజెస్ వారిచే శ్రీ గౌతమి ఆక్వా ఇండస్ట్రీస్ అను పేరుతో ప్యాకెజ్డ్ డ్రింకింగ్ వాటర్ ను తుని మార్కెట్ యార్డు చైర్మెన్ యనమల.కృష్ణుడు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టౌన్ టిడిపి అధ్యక్షుడు వీర్ల. సూరిబాబు, మండల వైస్ ప్రెసిడెంట్ బొమ్మిడి.సత్తిబాబు, న్యాయవాది రాజాల.చిట్టిబాబు, మడ్డు.వీరబాబు, అరిగెల. తాతయ్య దొర,నాగం.ప్రసాద్, అరిగెల.దొర తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ ఆహార పదార్థాల అమ్మకాలపై దర్యాప్తుచేపట్టాలి

యానాం : పట్టణ ప్రాంతంలో విచ్చలవిడిగా కల్తీ ఆహార పదార్థాలు అమ్మకాలు జరుగుతున్నాయని వాటిపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు దర్యాప్తుచేసి సంబంధిత వ్యాపారులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని పలువురు నాయకులు డిమాండ్ చేస్తున్నారు. వివిధ రెస్టారెంట్లు, బహిరంగ మార్కెట్‌లలో అనేక రకాల ఆహార పదార్థాలలో కల్తీ, నిల్వఉంచిన ఆహారపదార్థాలను అమ్మకాల చేస్తున్నారని దీని వలన కొనుగోలుచేసి భుజించినవారికి అనేక రోగాలు ప్రభలుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఏ ఒక్కసారైనా ఈ పదార్థాలను అధికారులు తనిఖీచేస్తారేమోనని చూస్తునామని అయినప్పటికీ వీరు అమ్మకాలు జరిగే ప్రాంతాలకు రావడం లేదన్నారు. ఈ వ్యవహారంపై అధికారులు నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరించడం వలన పలువురు బాధితులు రోగాలభారిన పడుతున్నారన్నారు. ప్రతి షాపును పక్కాగా తనికీచేసి కేసు నమోదుచేసి చర్యలు చేపట్టాలన్నారు.

బహిరంగ మార్కెట్‌లలో, రోడ్డులపైన ఆహారపదార్థాలు అమ్మకం చేసేవారి పై అధికారులు తనిఖీ నిర్వహించి నాణ్యతతో కూడిన ఆహార పదార్థులు అమకాలు జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల వస్తువులు, పండ్లు, కూరగాయలు, చేపలు, కుల్లిపోయి నిల్వఉంచి అమ్మకాలు చేస్తున్నారన్నారు. అలాగే నిత్యావసర వస్తువు లులో కల్తీ రాజ్యమేలుతుందన్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి చర్యలు చేపట్టాలన్నారు. అలాగే వ్యాపారులు తమ ఇష్టానుసారంగా ధరలు పెంచుకుంటూ అమ్మకాలు చేస్తున్నారని ఆరోపించారు.

# కులమతాలకు అతీతం రంజాన్ గ్రేటర్‌లో ఉద్యోగులకు ఇఫ్తార్ విందు



విశాఖపట్నం: కుల మతాలకు అతీతంగా, దేశవ్యాప్తంగా ప్రజలందరు జరుపుకునే పండగ రంజాన్ అని, ఈ పర్వదినం అత్యంత పవిత్రమైనదని జివియంసి అదనపు కమిషనర్ (జనరల్) జివివియస్ మూర్తి అన్నారు. గురువారం సాయంత్రం ఇక్కడ గుర్తింపు యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మూర్తి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. నెల రోజులకు పైగా ఉపవాస దీక్షలు చేసి లోకకళ్యాణం కోసం అల్లాను ప్రార్దిస్తున్న ముస్లిం సోదరులు అభినందనీయులన్నారు. గుర్తింపు యూనియన్ గౌరవధ్యక్షులు ఎమ్.ఆనందరావు మాట్లాడుతూ తొలిసారిగా గ్రేటర్‌లో ఇఫ్తార్ విందును ముస్లిం సోదరుల కోసం ఏర్పాటుచేసామన్నారు. భవిష్యత్‌లో ప్రతి ఏటా పెద్ద ఎత్తున ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసి ముస్లిం ఉద్యోగులను గౌరవించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి జనరల్ సెక్రటరీ లంకా భాస్కర్, గుర్తింపు యూనియన్ సలహాదారు, వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్ ఆధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, శాలివాహన, ఇతర ముఖ్యనేతలు హాజరయ్యారు. సలావుద్దీన్ ఆధ్వర్యంలో తొలిత ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. సుభాన్, రియాజ్ , అహ్మద్, హాయ్, సాబుద్దీన్, రవి తదితరులు పాల్గొన్నారు.

# నిత్య అన్నదాన పధకానికి రూ.లక్ష విరాళము



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి కొండపై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పధకానికి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు గ్రామానికి చెందిన తుంపాల.చిన్నారావు,వెంకటరమణ గారు రూ.1,00,116/ విరాళమును ఎసి ఈరంకి.జగన్నాథరావు గార్కి అందజేశారు.దీనిపై వచ్చు వడ్డీతో ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి 15వ తేదీన అన్నదానం జరిపించాలని కోరారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛను ఎస్ వి ఎస్ ఎన్ వర్మ



కొత్తపల్లి: తెలుగుదేశం ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి పేదవానికి పింఛను మంజూరు చేస్తున్నట్లు పిఠాపురం ఎమ్మెల్యే ఎస్ వి ఎస్ ఎన్ వర్మ అన్నారు. కొత్తపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయ ల ఆవరణంలో కొత్తగా మంజూరైన 440 పింఛనులను గురువారం లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల పక్షపాతి అన్నారు పాదయాత్ర ద్వారా పేద ప్రజల కష్టాలను గుర్తించి వారికి పింఛనులను మంజూరు చేసిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే ముఖ్యమంత్రి చంద్రబాబు అని ఎమ్మెల్యే వర్మ ప్రజలను తెలియజేశారు అనంతరం మండలంలో 86 మందికి ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా కిట్లను ఎమ్మెల్యే వర్మ అందజేశారు అదేవిధంగా మత్స్యకారులకు రాయితీపై లైఫ్ జాకెట్లను జిపిఎస్ మిషన్ నేలను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు ఈ కార్యక్రమంలో కొత్తపల్లి వైస్ ఎంపీపీ అనిశెట్టి సత్యానంద రెడ్డి, జడ్పిటిసి బత్తుల చైతన్య రాజేష్ కుమార్, ఎంపీడీవో పాఠం శెట్టి నారాయణ మూర్తి, తాసిల్దార్ కర్ణుడి రత్నకుమారి, సర్పంచులు పెంకే ప్రభాకర్ రావు కటారి రాజబాబు మరియుపాల్గొన్నారు

# గనులు కోసం రక్తదానంకు అద్భుత స్పందన

## క్యాంపులో పాల్గొన్నవారికి సిఐటియు హృదయపూర్వక అభినందనలు

విశాఖపట్నం : స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గుర్తింపు యూనియన్ గనులు కోసం రక్తదానం (బ్లడ్ ఫర్ మైన్స్) పిలుపుకు సుమారుగా 1000 మంది స్పందించి రక్తదానం చేయడానికి ఆమోదం తెలియజేశారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు ద్వారా 682 మంది ఈ రోజు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం వరకు రక్తదానం చేశారు. రాష్ట్రంలోని ఒకే పరిశ్రమలో ఒకే రోజు 682 మంది రక్తదానం చేయడం ప్రసంసనీయం. కార్మికులతో పాటు కొంత మంది అధికారులు కూడా రక్తదానంలో పాల్గొన్నారు. ముఖ్య అతిధిగా డైరెక్టర్ ఆఫరేషన్స్ పి.కె.రత్ పాల్గొని రక్తదానం చేసిన వారిని అభినందించారు. రక్తదానం చేసిన వారందర్ని సిఐటియు రాష్ట్ర కమిటీ వీరిని హృదయపూర్వకంగా అభినందించింది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు సమకూర్చాలని సిఐటియు గుర్తింపు యూనియన్ నాయకత్వంలో ఏప్రిల్ 5వ తేదీన 5వేల మందితో వైజాగ్ స్టీల్ మార్చ్ నిర్వహించింది. సొంత గనులు లేనందు వల్ల విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ గత మూడేళ్ళ నుంచి నష్టాలను ఎదుర్కొంటున్నది. దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్‌లకు కేంద్ర ప్రభుత్వం సొంత గనులు సమకూర్చింది. కాని విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ చేయాలనే కుట్రతో గత కాంగ్రెస్ నేడు బిజెపి ప్రభుత్వాలు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు సమకూర్చలేదు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాం.

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో వున్నా కడప, బయ్యారంలలో స్టీల్‌ప్లాంట్‌లు ఏర్పాటు చేయడం సాధ్యంకాదని కేంద్ర ఉక్కుగనుల మంత్రిత్వశాఖ మంత్రి నిన్న సుప్రీంకోర్టులో ఫిటిషన్ దాఖలుచేసింది. దేశాభివృద్ధికి స్టీల్ ఉత్పత్తిని పెంచడం చాలా ప్రాధాన్యత వున్నది. స్టీల్ పాలసీ ప్రకారం 2020 నాటికి మన దేశంలో 200 మిలియన్ మెట్రిక్ టన్నుల స్టీల్ ఉత్పత్తి చేయాలనే లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. గత సంవత్సరం స్టీల్ ఉత్పత్తి 99 మిలియన్ మెట్రిక్ టన్నులు మాత్రమే. దక్షణాదిలోని సేలం స్టీల్‌ప్లాంట్‌ను, భద్రావతిలోని విశ్వేశరయ్య స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌చేయాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. దక్షణాది రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తున్నది. విశాఖ స్టీల్‌కు సొంత గనులు సమకూర్చకుండా కేంద్ర ప్రభుత్వం ద్రోహం చేస్తున్నది. కడపలో స్టీల్‌ప్లాంట్ పెట్టాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులివ్వాలని రాష్ట్ర వ్యాప్తంగా జరగబోయే ఉద్యమంలో ప్రజలు కలిసిరావాలని కోరుతున్నాం.

# చిత్తూరు ఆత్మహత్యలకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలి : రాధమ్మ

అమలాపురం : చిత్తూరు జిల్లా కండిగ గ్రామంలో మగబిడ్డ పుట్టాలని అత్తింటి వారు పెట్టే వేధింపులకు గర్భిణీ తన ఇద్దరి కుమార్తెలతో బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న విషయం చాలా విచారకరమని, అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక సూర్యనగర్‌లో జరిగిన మహిళా సమావేశం తెలిపింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సామాజికవేత్త శ్రీమతి బి.ఎస్.రాధమ్మ హాజరయ్యారు. మృతుల ముగ్గురి ఆత్మశాంతికై ఒక్క నిముషం మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో వస్కా లక్ష్మి, భవాని, ఆదిలక్ష్మి, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# వైద్యులు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలి

## జాయింట్ కలెక్టర్ డా.ఎ. మల్లిఖార్జున



కాకినాడ:వైద్యులు ఆసుపత్రికి వచ్చే రోగులకు సరైన వైద్యసేవలు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించిన పనివేళ్లలో ఆసుపత్రికి వచ్చే రోగులకు సేవలు చేయాలని ఆ సమయంలో వైద్యులు ఎవరూ ప్రైవేటు ప్రాక్టీస్ చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరిండెంట్ కు ఆదేశించారు వైద్యులు ఎవరైనా ఆసుపత్రి పనివేళ్లలో ప్రైవేటు ప్రాక్టీస్ చేసినట్లయితే వారి జాబితాను తయారుచేయలని ఇందుకు సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేయలనిఅన్నారు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఆసుపత్రిలోనే ఉండి వారి సేవలను రోగులకు అందించాలని మధ్యలో ఎవరైనా బయటకు వెళ్లితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు క్యాజువాలిటీలోని మిగిలిన విభాగాలలోనూ హౌస్ సర్జన్లు పీజీలు హాజరవుతున్నారే తప్పా అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎవరు ఉండడం లేదని గమనించినట్లు తెలిపారు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పని సమయాలు పాటించాలని అలా పాటించాల్సిన బాధ్యత హెచ్ ఓ డి లదే అని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ డా.రాఘవేంద్రరావు ప్రిన్సిపాల్ డాక్టర్ మహాలక్ష్మి డాక్టర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు

# చిత్రభాను





## నా నువ్వే రివ్యూ

కథానాయకుల్ని విభిన్నమైన కథల్లో చూసుకునే అవకాశం ప్రేక్షకులకు లభిస్తోంది. తెరపై కొత్తగా కనిపించాలని... ప్రేక్షకులకు కొత్తదనాన్నిపంచాలనే ప్రయత్నంలో భాగంగా కథానాయకులు తాము ఇదివరకు చేయని కథల్ని ఎంచుకొంటున్నారు. కల్యాణ్‌రామ్ ఎప్పుడూ ఫక్తు వాణిజ్యాంశాలతో కూడిన కథల్లోనే నటించేవారు. కానీ, ఈసారి అందుకు భిన్నంగా ఒక రొమాంటిక్ కథని ఎంచుకొని %--%నా నువ్వే%--% చేశాడు. మోర్ లవ్.. మోర్ మేజిక్ అనే ఉపశీర్షికతో తెరకెక్కిన ఈ చిత్రానికి ఛాయాగ్రాహకుడు పి.సి.శ్రీరామ్ కావడం... కల్యాణ్‌రామ్ కొత్త లుక్‌లో కనిపించడంవంటి విషయాలు విడుదలకి ముందే ఆసక్తిని రేకెత్తించాయి. మరి ఈ ప్రేమకథ ఎలాంటి మేజిక్ చేసిందో తెలుసుకుందాం.

కథేంటంటే: వరుణ్ (కల్యాణ్‌రామ్) ఉద్యోగం కోసం అమెరికా వెళ్లే ప్రయత్నాల్లో ఉంటాడు. రెండుసార్లు అమెరికా వెళ్లాలన్న ప్రయత్నం విఫలమవుతుంది. మూడోసారి కచ్చితంగా అమెరికా వెళ్తాననే నమ్మకంతో ఉంటాడు. విధిని పెద్దగా నమ్మని వరుణ్‌ని రేడియో జాకీ మీరా (తమన్నా) కలుస్తుంది. వరుణ్ తన లక్కీ ఛార్మ్ అని భావిస్తుంది. విధే ఇద్దరినీ కలిపిందని నమ్మే మీరా.. వరుణ్ ప్రేమలో మునిగిపోతుంది. మరి విధిని నమ్మని వరుణ్.. మీరాని ప్రేమించాడా? లేదా? వాళ్లిద్దరి ప్రేమకథని విధి ఎలా మలుపు తిప్పింది? తదితర విషయాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

ఎలా ఉందంటే: విధి చుట్టూ అల్లుకున్న కథ ఇది. చాలా సినిమాల్లో విధి అనే విషయాన్ని ఒకట్రెండు చోట్ల వాడుతూ అందులోని మేజిక్‌ని చూపించే ప్రయత్నం చేస్తుంటారు. కానీ ఇక్కడ మాత్రం కథ మొత్తాన్ని విధి చుట్టూనే తిప్పారు. కొన్నిచోట్ల విధికే పరీక్ష పెట్టారు. దాంతో విధి అనే విషయంలో అసలు మేజిక్ కనుమరుగైపోయి, సన్నివేశాలు కృతకంగా మారిపోయాయి. ప్రేమకథలోనూ కొత్తదనం లేదు. దాంతో సినిమాని ఆద్యంతం ఓపికగా చూడాల్సిన పరిస్థితి. వరుణ్ తన జీవితంలోకి వచ్చిన విషయాన్ని.. విధి అతన్ని కలిపిన వైనాన్ని మీరా రేడియోలో తన ఫ్లాష్‌బ్యాక్‌గా చెప్పడంతో ఈ కథ మొదలవుతుంది. విధిని నమ్మే మీరా... నమ్మని వరుణ్.. ఎలాంటి పరిస్థితుల్లో కలుసుకున్నారనే అంశాలతో తొలి సగభాగం కథ సాగుతుంది.

వెన్నెల కిషోర్, ప్రియదర్శి తదితర నటులు చేసే సందడితో అక్కడక్కడ నవ్వులు పండటం మినహా తొలిభాగం కథలో చెప్పుకోదగ్గ విషయాలేమీ లేవు. ద్వితీయార్ధంలోనే కొన్ని మలుపులు చోటు చేసుకుంటాయి. కానీ, అవి కూడా ప్రేక్షకుడి ఊహకు తగ్గట్టుగానే



అనిపిస్తాయి. అయితే తొలి సగభాగంతో పోలిస్తే, ద్వితీయార్ధం పర్వాలేదనిపిస్తుంది. ఒక పక్క పీసీ శ్రీరామ్ అందమైన ఫ్రేమ్.. అందులో కల్యాణ్‌రామ్, తమన్నా వంటి అందమైన జంట కనిపిస్తున్నప్పటికీ ప్రేమకథలకి కావల్సిన మేజిక్, కెమిస్ట్రీ ఎక్కడా..? అని వెదుక్కోవాల్సిన పరిస్థితి. రాసుకున్న సన్నివేశాల్లోనే ఫీల్ లేనప్పుడు సినిమాకి ఎన్ని హంగులు జోడించినా వ ృథానే అనే విషయం ఈ చిత్రంతో అర్థమవుతుంది. యాడ్ ఫిల్మ్ తీయడంలో నిష్ణాతుడైన జయేంద్ర ఇలాంటి చిన్న కథతో, అంతే పరిమితుల్లోనే సన్నివేశాలు రాసుకొని ఈ చిత్రాన్ని తీర్చిదిద్దినట్టు అర్థమవుతుంది.

ఎవరెలా చేశారంటే: కల్యాణ్‌రామ్ కొత్త లుక్ బాగుంది. తొలిసారి పూర్తిస్థాయి రొమాంటిక్ కథలో నటించినప్పటికీ ఆయన మంచి పనితీరును కనబరిచాడు. తమన్నాకు, ఆయనకు మధ్య అక్కడక్కడా మంచి కెమిస్ట్రీనే పండింది. తమన్నా ఈ సినిమాకి ప్రధానబలం. ఆమె అందంగా కనిపించింది. నటన, హావభావాల పరంగా కూడా ఆకట్టుకుంటుంది. మిగిలిన పాత్రల గురించి చెప్పుకోవాల్సినంతేమీ లేదు. వెన్నెల కిషోర్, ప్రవీణ్, తనికెళ్ల భరణి, సురేఖావాణి, పోసాని క ృష్ణమురళి చిన్న చిన్న పాత్రల్లో కనిపించి పరిధి మేరకు నటించారు. సాంకేతికంగా సినిమాకి మంచి మార్కులు పడతాయి. పీసీ శ్రీరామ్ కెమెరా మాయాజాలం పాటల్లో చాలా బాగా కనిపిస్తుంది. ప్రతి ఫ్రేమ్‌ని అందంగా చూపించారు. శరత్ వాసుదేవన్ సంగీతం బాగుంది. రచన, దర్శకత్వం పరంగానే లోపాలు కనిపిస్తాయి. నిర్మాణ విలువలు బాగున్నాయి. కథకి ఏం కావాలో అవన్నీ పక్కాగా సమకూరాయి.

## విశాఖలో మోషన్ ఐఐటి అకాడమీ - నేడు ప్రారంభం

### విద్యార్థుల ఐఐటి కల కేవలం మోషన్ అకాడమీ తోనే సాధ్యం




విశాఖపట్నం : విద్య అనేది వాణిజ్యం కాదని, విద్యార్థుల అభివృద్ధి కోసమే అనే నినాదంతో ప్రారంభమైనదే రాజస్థాన్ లోని కోటా నగరంలో స్థాపించిన మోషన్ విద్యా సంస్థ ఐఐటి - జెఇఇ, మెడికల్. ఈ విద్యా సంస్థ ద్వారా వేలాది మంది విద్యార్థినీ విద్యార్థులు ఐఐటి - జెఇఇ లోను. మెడికల్ పరీక్షల్లోను అత్యద్భుతమైన ఫలితాలు అందించి దేశంలోనే అత్యుత్తమ స్థానంలో నిలిచిందని మోషన్ విశాఖ కేంద్రం డైరక్టర్ కాంద్రేగుల ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం నగరంలోని ఓ హోటల్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి ఒత్తిడి లేకుండా ఆధునిక సౌకర్యాల ద్వారా విద్యన,ం నేర్పించడమే ఈ మోషన్ ఐఐటి అకాడమీ సంస్థ విజయరహస్యమన్నారు. ఐఐటి శిక్షణా విద్యా విధానంలో డిజిటల్ స్కీన్స్ ద్వారా శిక్షణ ఇచ్చే మొట్టమొదటి సంస్థ మోషన్ ఆకాడమీ అని తెలిపారు. విశాఖ కేంద్రంగా ఈ సంస్థ శాఖలను పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్నామని, ప్రధానంగా డే స్కాలర్ల కోసం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఏర్పాటు చేయడం జరిగిందని, ఉత్తరాంధ్రా జిల్లాల విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ విద్యా సౌలభ్యం నెలకోల్పామని, వాటిల్లో బాలురకు , బాలికలకు వేర్వేరుగా ఏర్పాటు చేసామన్నారు. ప్రతీ తరగతిలోను కేవలం 40 మంది విద్యార్థులు మాత్రమే ఉంటారని, ఆ పైబడిన విద్యార్థుల కొరకు మరో తరగతి గది లో శిక్షణ అందించడం జరుగుతుందని వివరించారు. రోజుకు కేవలం 6 నుంచి 8 గంటల సమయం మాత్రమే విద్యా విధానం అమలు లో ఉంటుందని, ప్రతీ వారం నిర్వహించే వారాంతపు పరీక్షల ద్వారా విద్యార్థి పోరాట పటిమ, విద్య ప్రతిభను గమనించి, వారికి ప్రత్యేక శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. కేవలం డిజిటల్ విద్యా విధానం ద్వారా నిర్వహించే తరగతి విద్యా విధానం అత్యుత్తమ ఫలితాలను సాదించడం జరిగిందన్నారు. గత ఏడాది తమ మాతృ సంస్థ ద్వారా శిక్షణ పొందిన 68 శాతం విద్యార్థులు ఐఐటి కి అర్హత సాధించారన్నారు. ఉత్తరాంధ్రా, ఆంధ్ర ప్రదేశ్ లోని ఇతర జిల్లాల నుంచి వందల సంఖ్యలో రాజస్థాన్ లోని కోటా నగరానికి వెళ్ళి మోహన్ అకాడమీ లో చేరి, ఉత్తమ ఫలితాలు సాధించారని, వీరందరిని లక్ష్యాన్ని దృష్టి లో ఉంచుకుని విశాఖ నగరంలోనే పలు శాఖ లను ప్రారంభించాలని అని మోషన్ విద్యా సంస్థ సంకల్పించి ఇక్కడ పలు శాఖలను ఏర్పాటు చేసిందని వివరించారు. ఈ శాఖల్లో డే స్కాలర్లకు, రెసిడెన్షియల్ విద్యార్థులకు వేర్వేరు క్యాంపస్ లు ఏర్పాటు చేసామన్నారు. బాలురకు , బాలికలకు సైతం ప్రత్యేక క్యాంపస్ లను నెలకొల్పడం జరుగుతొందన్నారు.

**రాజస్థాన్ ఫ్యాకల్టీ తోనే శిక్షణ :** మోషన్ అకాడమీ కేంద్ర కార్యాలయం కోటా నుంచి వచ్చిన అత్యుత్తమ అధ్యాపకులచే విశాఖ కేంద్రంలోని శాఖల్లో తరగతులు నిర్వహించబడతాయని తెలిపారు. వీరికి అదనంగా సీనియర్ ఐఐటి శిక్షకులు ఉండి, ఒక్కొ పాఠ్యాంశానికి ఇద్దరు నుంచి, ముగ్గురు అధ్యాపకులచే తరగతులు జరుగుతాయన్నారు.

విశాఖ నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల హోటల్ మేఘాలయ దరి తమ సంస్థను శుక్రవారం ఉదయం విశాఖపట్నం లోక్ సభ సభ్యులు , విద్యా వేత్త డాక్టర్ కె. హరిబాబు ప్రారంభిస్తారది, ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ జిఎస్ఎన్ రాజు, ఆంధ్ర విశ్వకళాపరిషత్ ఉపకులపతి డాక్టర్ జి. నాగేశ్వరరావు, స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అద్యక్షుడు ఆడారి కిశోర్ కుమార్ తదితరులు హాజరవుతారన్నారు.

**యువశక్తి చరిత్ర తిరగరాస్తోంది :**

విద్య ను నముకున్న యువతరం తమ శక్తి సామర్థ్యాలను నమ్ముకుని అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నాయని, విశ్రాంత మునిసిపల్ కమిషనర్ దువ్వారపు రామారావు, సీనియర్ విద్య వేత్త కోటేశ్వర రావు, ప్రముఖ న్యాయవాది నర్రా వెంకట రమణ లు అభిప్రాయపడ్డారు. పాఠశాల విద్యా తర్వాత సరైన మార్గదర్శకం లేని యువతకు అండగా నిలబడిన ప్రవీణ్ కుమార్ బృందానికి అభినందనలు తెలిపారు. పదవ తరగతి తర్వాత నేరుగా ఉన్నత విద్య చదవడం ఉండదని, మంచి ఆశయాలు కల్గిన విద్యా సంస్థ అండగా నిలబడితే విద్యార్థులు ఉత్తమ భారతీయులుగా తయారవుతారన్నారు.

కార్యక్రమంలో స్టూడెంట్ జె ఏ సి రాష్ట్ర అధ్యక్షులు ఆడారి కిషోర్ కుమార్ మాట్లాడుతూ డిజిటల్ విధానం ద్వారా పాఠ్యాంశాలు వివరించడం అత్యుత్తమ విద్యా విధానంగా మారుతోందని, ఈ సాంకేతిక విప్లవం విశాఖకు వస్తుండడం అద్భుతమన్నారు.

ప్రస్తుత విద్యా విధానానికి, ఇతర సంస్థల్లో అమలవుతున్న విద్యా విధానానికి ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. రేపటి ఉదయం 9 గంటలకు హోటల్ మేఘాలాయ సమీపంలోని మోహన్ విద్యా సంస్థ కళాశాలను నగర ఎంపీ ప్రారంభిస్తారన్నారు.

## ఏపీని అన్ని విధాలా ఆదుకుంటాం

### - తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు - ఎంపీ హరిబాబు ప్రకటన



విశాఖపట్నం : త్వరలో విశాఖ రైల్వే జోన్‌ను సాధిస్తామని, విమాన ప్రయాణీకులకు విఘాతం కలగకుండా తగు ఏర్పాట్లు చేస్తామని మెకనైజ్డ్ లాండ్రీ ప్రారంభోత్సవంలో ఎంపీ హరిబాబు పేర్కొన్నారు. విశాఖలో మెకనైజ్డ్ లాండ్రీ ప్రారంభోత్సవం అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆంధ్రా అభివృద్ధికి అనేక హామీలు ఇచ్చారని దీనిని రాష్ట్ర ప్రభుత్వం తప్పుగా అర్థం చేసుకుని తప్పుడు ప్రచారాలు చేస్తోందని ఆయన దుయ్యబట్టారు. ముగ్గురు కేంద్ర మంత్రులు ఏపీలో పర్యటించి స్టీల్‌ప్లాంట్ తదితర పరిశ్రమల స్థాపన విషయంలో విస్తృత పరిశీలన జరుపుతారన్నారు. పౌర విమాన సేవలకు నష్టం జరగకుండా తగు ఏర్పాట్లు పరిశీలిస్తున్నారని ఆయన అన్నారు. వాల్తేరు డివిజన్‌లో విశాఖ ప్రత్యేక రైల్వే జోన్ ప్రకటించేందుకు అన్ని ఏర్పాట్లు చేసేందుకు సిద్ధమౌతోందని అన్నారు.



## ఎన్ఆర్ఐ భర్త వేధింపులకు భార్య మృతి



విశాఖ (క్రైం): అత్తింటి వేధింపులు తాళలేక విశాఖలో పసుపులేటి వాణి (35) విషం తాగి ఆత్మహత్య చేసుకుంది. వివరాలలోకి వెళితే.. విశాఖ చినవాల్తేరు కిర్లంపూడి లేఅవుట్ ప్రిన్స్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న వాణికి ఏడేళ్ల క్రితం కృష్ణానగర్‌కు చెందిన గంగాధర్‌తో వివాహాన్ని పెద్దలు జరిపించారు. వాణి, గంగాధర్ దంపతులిరువురు సాఫ్ట్‌వేర్ రంగానికి చెందిన వారే కావడంతో అమెరికాలో స్థిరపడ్డారు. వారికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. అయితే, భర్త గంగాధర్‌కన్నా భార్య వాణి సంపాదనలో అదనంగా ఉండడంతో వాణికి అత్తింటిటి వారి వేధింపులు మొదలయ్యాయి. నీ సంపాదనలో కొంతవరకు మా తల్లిదండ్రులకు ఇవ్వాలని భర్త గంగాధర్ డిమాండ చేయడంతో భార్యాభర్తలిరువురికి అమెరికాలోనే మనస్పర్థలు మొదలయ్యాయి. ఈ విషయమై ఏప్రిల్ నెలలో ఇద్దరూ విశాఖ వచ్చేశారు. నగరానికి చేరుకున్నాక వాణికి అత్తింటి వేధింపులు మరింతగా ఎక్కువయ్యాయి. అప్పటి నుంచి భర్తకు దూరంగా చినవాల్తేరులో ఉన్న తల్లిదండ్రుల వద్ద వాణి ఉంటోంది. ఇటీవల కాలంలో భర్త, అత్తమామల నుండి వేధింపులు మరింత ఎక్కువ కావడంతో మనస్థాపానికి గురై విషం తాగి ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న బంధువులు పోలీసులకు సమాచార మందించడంతో పోలీసులు రంగప్రవేశం చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# పోలవరంపై జగన్ తప్పుడు ప్రచారం

## రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



అమరావతి : పోలవరం ప్రాజెక్టులో ఎంతోమంది త్యాగాలున్నాయని, పోలవరం డ్యామ్ సైట్ లో 9వేల మంది ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు, కూలీలు పనిచేస్తున్నారని, ఇన్ని వేల మంది పనిచేస్తుంటే పోలవరం సినిమా చూపిస్తున్నారని మాట్లాడటానికి వైసీపీ నేత జగన్మోహన్ రెడ్డికి నోరెలావచ్చిందని ఆంధ్రప్రదేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారంనాడు మంత్రి ఉమా జలవనరుల శాఖ విడిది కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టుపై ఏ మాత్రం అవగాహన లేని జగన్ మాట్లాడుతుంటే విడ్డూరంగా ఉందని, ఈ నెల రోజుల్లోనే పోలవరం ప్రాజెక్టును 22వేల మంది రైతులు సందర్శించారు.

కొన్ని వందలమంది పోలవరం డ్యామ్ సైట్ కు వెళ్లి ఆనందంగా తిరిగొస్తూ సీఎంను ప్రశంసిస్తున్నారని అన్నారు. రూ.8619 కోట్లు డ్యామ్ సైట్ లో ఖర్చుపెట్టి పెద్ద ఎత్తున పనులు జరుగుతుంటే సినిమా చూపిస్తున్నారని మాట్లాడటం ఏ మాత్రం సబబో జగనే చెప్పాలన్నారు. రూ.24వేల కోట్లతో అమరావతి పనులు జరుగుతుంటే.. అమరావతిని భ్రమరావతి అని ఎద్దేవా చేస్తావా? పోలవరం సినిమా చూపిస్తున్నామని జగన్, విజయసాయిరెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతున్నారు. సొమ్ము మాది.. సోకు మీదని కన్నా లక్ష్మీనారాయణ అంటారని, ఒక ఎమ్మెల్యే, ఒక ఎంపీ సీటిస్తే మా పార్టీలోకి వచ్చేవాడు వీళ్లా మమ్మల్ని విమర్శించేదన్నారు. వైసీపీ, బీజేపీ, జనసేన పార్టీల అజెండా ఒక్కటే.. కేంద్ర ప్రభుత్వం డైరెక్షన్ లో పనిచేయడమే వారి పనని అభివర్ణించారు.

# అభివృద్ధే అన్నింటికీ సమాధానం..



రాయ్‌పూర్: దేశంలో జరుగుతున్న అభివృద్ధే అన్ని రకాల హింసలకూ సమాధానం చెబుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వివిధ ప్రాజెక్టుల ప్రారంభం నిమిత్తం ఛత్తీస్‌గఢ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... అభివృద్ధే అన్ని రకాల హింసకు సరైన సమాధానమని నా నమ్మకం. రాష్ట్రంలో నక్సలిజానికి అంతు లేకుండా పోతోంది. దీనిపై అప్రమత్తమవ్వాల్సిన అవసరం ఎంతో ఉంది. ఛత్తీస్‌గఢ్ అంటే కేవలం అడవులు, గిరిజనులు అన్న అపోహను భాజపా పోగొట్టింది. ఇప్పుడు ఈ రాష్ట్రమంటే స్మార్ట్ సిటీ నయా రాయ్‌పూర్ అని ఈ రాష్ట్ర ప్రజలు సగర్వంగా చెప్పుకొనేలా చేశాం. గిరిజనుల ఆదాయాన్ని రెట్టింపు చేసే దిశగా భాజపా ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చింది యూపీఏ హయాంలో ఎప్పుడూ ఛత్తీస్‌గఢ్‌ను పట్టించుకోలేదు. దేశంలో ఈ రాష్ట్రం కూడా ఒక భాగమేనని యూపీఏ పూర్తిగా మర్చిపోయింది. ఈ రాష్ట్రంతో నాకు ఎంతో అనుబంధం ఉంది. ఈ రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాల్లోనూ నేను పర్యటించాను. అని తెలిపారు.

జగ్దల్ పూర్-రాయ్‌పూర్ మధ్య విమాన సర్వీసులను ప్రారంభించిన అనంతరం మోదీ మాట్లాడుతూ.. చిన్న పట్టణాలు, నగరాలను కలిపే విధంగా విమాన సేవలను అందించడం మా ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. హవాయి చెప్పులు వేసుకునే వాళ్లు కూడా విమానాల్లో ప్రయాణించాలన్నదే నా కల. రాయ్‌పూర్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఇప్పటివరకు కేవలం 6 విమాన సర్వీసులు మాత్రమే ఉండేవి. ఇకనుంచి 50విమానాలు ఇక్కడి నుంచి ప్రయాణిస్తాయి. చిన్న పట్టణాలను విమాన సర్వీసులతో అనుసంధానం చేయాలనే ఉడాన్ పథకాన్ని మరింత వేగంగా అమలు చేస్తాం. అని తెలిపారు.

# ముందు కుస్తీ పోటీలంటారు.. ఆ తర్వాత...



విజయవాడ: వైఎస్సార్ కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించక పోవడం అన్యాయమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత అంబటి రాంబాబు తెలిపారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ నేతలు ఇపుడు గగ్గోలు పెడుతున్నారు.. నాలుగేళ్లు కేంద్రంతో కలిసి ఉన్నపుడు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమ సాధ్యం కాదని కేంద్రం చెప్పింది. కానీ అపుడు ఎన్డీయేలో టీడీపీ ఉంది కాబట్టి ఏమీ మాట్లాడలేదన్నారు. ఆరునెలల్లో ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపడుతామని.. ఆ మేరకు విభజన చట్టంలోని 13 వ షెడ్యూల్‌లో ఉందని తెలిపారు.

దొంగలు పడ్డ ఆరునెలలకు టీడీపీ నేతలు మొరుగుతున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబులు కలిసి రాష్ట్రాన్ని అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. విభజన హామీలపై చివరిదాకా పోరాడేది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే అని స్పష్టం చేశారు. కేవలం ప్రజలను మభ్య పెట్టేందుకు టీడీపీ దీక్షల డ్రామాలాడుతోందన్నారు. మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని ప్రజలు తిరస్కరించారని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించే స్థాయి ఆయనకు ఉందా అని ప్రశ్నించారు.

టీడీపీ నేతలు ముందు కుస్తీ పోటీలంటారు.. ఆ తర్వాత మోదీ కాళ్లు పట్టుకుంటారని ఎద్దేవా చేశారు.

# అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు సహకరించాలి

## జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్



విశాఖపట్నం : ప్రజలకు వైద్య సౌకర్యాలను మెరుగుపర్చేందుకు నిర్దేశించిన బహుళ అంతస్థుల భవన నిర్మాణానికి పబ్లిక్ సెక్టార్ సంస్థలు ముందకు రావాలని జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో పబ్లిక్ సెక్టార్ ప్రతినిధులతో సిఎస్ఆర్ కింద చేపడుతున్న ప్రాజెక్టులపై కలెక్టర్ సమీక్షించారు. కెజిహెచ్‌లో బహుళ అంతస్థుల అంకాలజీ, సర్జికల్ బ్లాక్‌లను నిర్మించుటకు 80 కోట్ల రూపాయల సిఎస్ఆర్ నిధులతో 6 అంతస్థుల్లో నిర్మించడానికి పాలనా పరమైన ఆమోదం లభించింది. అందుకోసం ఆర్ ఐఎన్ఎల్, ఎన్టీపీసీ, హెచ్‌పిసిఎల్, భెల్, ఓఎన్జీసీ, గెయిల్, ఎన్‌పిసిఐఎల్ సంస్థలు ఐదేళ్లలో 53 కోట్ల రూపాయలను సమకూర్చుటకు డిపిఆర్ చేసుకున్నాయి. అయితే ఇంతవరకు పై సంస్థల నుండి 15.98 కోట్లు డిపాజిట్ అయినాయని, ఇంకనూ 38.02 కోట్ల రూపాయలను డిపాజిట్ చేయవలసి వుందని, వాటిని త్వరగా విడుదల చేస్తే ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయగలుగుతామని కలెక్టర్ కోరారు. నిధులు త్వరగా కేటాయించుటకు గాను పబ్లిక్ సెక్టారు సంస్థలకు డి.ఓ. లేఖ రాయాలని కెజిహెచ్ సూపరింటెండెంట్ డా. అర్జునకు కలెక్టర్ సూచించారు. కార్పొరేట్ సంస్థలు అభివృద్ధికి సహకరిస్తే వారి పేరు మీదనే వైద్య సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఆయా సంస్థలను ప్రజలు గుర్తుంచుకుంటారని ఇతోధికంగా నిధులు కేటాయించడానికి ముందుకు రావాలని పిఎస్‌యులను కలెక్టర్ కోరారు.

సమావేశంలో ఆర్ఐఎన్ఎల్, ఎన్టీపీసీ, హెచ్‌పిసిఎల్, భెల్, ఓఎన్జీసీ, గెయిల్, ఎన్‌పిసిఐఎల్ సంస్థ ప్రతినిధులు కెజిహెచ్ ఆర్ఎం ఓ శాస్త్రి, ఎపిఎంఎస్ఐడిసి ఇఇ ఉమేష్ తదితరులు హాజరైనారు.

# సృజనలో జాతీయ స్థాయి ఘనతను సాధించిన ఉక్కు ఉద్యోగులు




విశాఖపట్నం: స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు ఈ సంవత్సరంలో కూడా సలహా సంఘాలు, సృజనాత్మకత తదితర అంశాల్లో పలు అవార్డులు సాధించారు. బుధవారం నాడు జిల్లాలో జరిగిన ఇతర జాతీయ సృజనాత్మక సమావేశంలో వివిధ సంస్థలకు చెందిన సుమారు 160కు పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. వీరు ఉత్పాదకతతో సృజనాత్మకతను విషయాలను పంచుకున్నారు. విశాఖ ఉక్కు ఉద్యోగులు కూడా తమ సృజనాత్మకత ఉత్పాదకలకు గాను అవార్డులు గెలుచుకున్నారు.

ఆర్ఎస్ & ఆర్ఎస్ ఎడిఎం ఆర్. సత్యనారాయణ, ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగపు డిప్యూటీ మేనేజర్ ఎ. వెంకటేష్, సీనియర్ ఫోర్‌మెన్ డి. హరిబాబు తదితరులు ఈ అవార్డులు గెచుకున్నారు.

## 'కేంద్రం మరోసారి మోసం చేసింది'

అమరావతి: కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని చెప్పి కేంద్రం మరోసారి మోసం చేసిందని టీడీపీ ఎంపీ కేశినేని నాని విమర్శించారు. మెకాన్ సర్వేలో ఉక్కు ఫ్యాక్టరీపై సానుకూలత వ్యక్తమైనా.. అఫిడవిట్ ద్వారా కేంద్రం దుర్బుద్ధిని చూపించిందని ఏపీ బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ మండిపడ్డారు.

LOANS / లోన్స్
HAPPY HOMES
We arrange Business Loans
Mortgage Loans
Home Loans Personal Loans
and Pvt. Loans... Etc.,
94902 33750

# తొలి భారతీయ ఆటగాడు అతడే!

## శిఖర్ ధావన్

### తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 347/6



బెంగళూరు: బెంగళూరు వేదికగా భారత్, అఫ్గానిస్థాన్ మధ్య మొదలైన ఏకైక టెస్టులో తొలి రోజు ఆటలో భారత ఓపెనర్లతో పాటు వరుణుడు కూడా ఓ ఇన్నింగ్స్ ఆడాడు. లంచ్ విరామం తర్వాత రెండు సార్లు వరుణుడు జోరు కొనసాగించి అఫ్గాన్ బౌలర్లు ఆశలపై నీళ్లు చల్లాడు. భారత ఓపెనర్లు శిఖర్ ధావన్(107; 96బంతుల్లో 19స4, 3స6), మురళీ విజయ్(105; 153బంతుల్లో 15స4, 1స6) చెరో శతకంతో చెలరేగడంతో తొలి రోజు ఆటు ముగిసే సమయానికి భారత్ ఆరు వికెట్ల నష్టానికి 347 పరుగులు చేసింది. క్రీజులో హార్దిక్ పాండ్యా(10; 21బంతుల్లో), అశ్విన్(7;16 బంతుల్లో) ఉన్నారు.

**అదరగొట్టిన గబ్బర్..**

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్ శిఖర్ ధావన్, మురళీ విజయ్‌తో కలిసి శుభారంభాన్ని ఇచ్చాడు. మొదటి నుంచే దూకుడుగా ఆడుతూ వచ్చిన ధావన్ అఫ్గాన్ బౌలర్లను ఏమాత్రం ఖాతరు చేయ కుండా జోరు కొనసాగిం చాడు. ఒకవైపు మురళీ విజయ్ నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తుంటే, ధావన్ మాత్రం వన్డే తరహాలో ధాటిగా ఆడుతూ వచ్చాడు. ఈ క్రమంలో రషీద్ ఖాన్ వేసిన 14 ఓవర్‌లో మూడు బౌండరీలు బాది అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. తర్వాత కూడా జోరు కొనసాగిస్తూ.. ఎడాపెడా బౌండరీలు, వీలు చిక్కినప్పుడల్లా సిక్సర్లు బాదుతూ.. స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. ఇక రషీద్ వేసిన 26ఓవర్‌లోనే మరో బౌండరీతో టెస్టులలో ఏడో శతకాన్ని పూర్తి చేశాడు. అప్పటికి భారత స్కోరు 27ఓవర్లలో 158/0. ఎన్నో ఆశలు పెట్టుకున్న రషీద్, ముజీబ్, నబి వంటి ప్రధాన స్పిన్ బలగమంతా ధావన్ ధాటికి తేలిపోయింది. కానీ, లంచ్ తర్వాతి సెషన్‌లో ధావన్ అదే జోరు కొనసాగిస్తారేమో అనుకున్నారు.

కానీ, 28.4 ఓవర్‌లో అహ్మద్‌జాయ్ బౌలింగ్‌లో ధావన్(107; 96బంతుల్లో 19స4, 3స6) ఫీల్డర్ నబికి సులభ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు.

# ఘనంగా శ్రీ కుంచుమాంబ శిఖర ఊరేగింపు

## శ్రీ కుంచుమాంబ అమ్మవారి విగ్రహ పున:ప్రతిష్ట మహోత్సవాలు



మద్రిపాలెం : శ్రీ శ్రీ శ్రీ కుంచుమాంబ అమ్మవారి విగ్రహ పున: ప్రతిష్ట మహోత్సవం 3 రోజుల పాటు నిర్వహించేందుకు పురోహితులు నిర్ణయించారు. ఈ సందర్భంగా గురువారం మొదటి రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ప్రారంబోత్సవం అయ్యింది. శ్రీ శ్రీ శ్రీ కుంచుమాంబ అమ్మవారి విగ్రహం విరాళదాత మూల గోవిందరావు, సంతోషిరూప దంపతులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిఖరంతో మాధవధార గ్రామ పూర వీధుల గుండా పూరేగింపు నిర్వహించారు. అనంతరం శిఖరానికి నీలాభిషేకం నిర్వహించారు.

ఈ కార్యక్రమం శ్రీ మాధవ యువజన సమాజం అద్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మాధవ యువజన సమాజం అధ్యక్ష, కార్యదర్శి భగవతి శ్రీరామమూర్తి, సనపల అప్పలస్వామి, కార్యవర్గ సభ్యులు, మాధవధార గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## నిరుద్యోగులను మోసం చేస్తున్న ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న యర్రంశెట్టి పాపారావు

నర్సీపట్నం : ప్రభుత్వ, ప్రైవేటు శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానం ద్వారా నిరుద్యోగుల నుండి లక్షలాది రూపాయలు గుంజుతూ నిరుద్యోగులను నిలువునా ముంచుతున్నారని, ఇలాంటి ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెల్లి హక్కుల రిజర్వేయర్ పోరాట సమితి రూరల్ జిల్లా అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు అన్నారు. గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో ఇటువంటి ఏజెన్సీలు పుట్టుకొస్తూ నిరుద్యోగులనుమోసం చేస్తున్నా ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇటువంటి ఏజెన్సీలను రద్దు చేసి ప్రభుత్వమే అర్హులైన వారికి డైరెక్టుగా ఖాళీలను భర్తీ చేయాలని అప్పుడు నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంతో పాటు అవినీతి జరగకుండా ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో ప్రభుత్వం అన్ని వసతులు కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. పై సమస్యలపై స్పందించకుంటే ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిటీ మెంబరు దొండా చిన అప్పారావు, కమిటీ మెంబరు మీసాల బాలసుబ్రహ్మణ్యం, నర్సీపట్నం మున్సిపాలిటీ మండల అధ్యక్షులు పరపతి యుగంధరరావు, మండల అధ్యక్షులు ఇల్లాపు బెన్నెసులు పాల్గొన్నారు.

## ఈనెల 20న కార్పొరేషన్ రుణ మంజూరుకు ఇంటర్వ్యూలు

నర్సీపట్నం : 2018-2019 ఆర్థిక సంవత్సరం షెడ్యూల్డ్ కులముల, వెనుకబడిన తరగతులు, వెనుకబడిన తరగతుల వారి ఫెడరేషన్లు, మైనారిటీ, బిసి(ఎ) బ్యాంకు ద్వారా, బ్యాంకు ద్వారా లేనివారు, ఇబిసి, వైశ్య, కాపు కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు కొరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న నర్సీపట్నం మండలంలోని 9 గ్రామ పంచాయతీల వారు ఈ నెల 20న మండల పరిషత్ కార్యాలయంలో జరుగు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని నర్సీపట్నం ఇన్‌చార్జ్ ఎంపిడిఒ బిహెచ్‌వి.రమణ బాబు కోరారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఒరిజినల్ ధృవపత్రాలైన ఆధార్, రేషన్‌కార్డు, కులధృవీకరణ బ్యాంకు ఖాతా పుస్తకంతో విధిగా హాజరు కావాలన్నారు.

## ఇంజినీరింగ్ ఇతర సిబ్బంది కౌన్సిల్ సభ్యుల అధికారాలను కాలరాస్తున్నారు



విజయనగరం: ఇంజినీరింగ్ ఇతర సిబ్బంది కౌన్సిల్ సభ్యుల అధికారాలను కాలరాస్తున్నారని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ప్రసాదుల రామకృష్ణ అధికారులపై మండిపడ్డారు.గురువారం విజయనగరం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం కౌన్సిల్ భవనంలో ఛైర్మన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎజండాలోని వివిధ అంశాలపై జరిగిన చర్చలో ఒక దశలో అధికారులపై కౌన్సిల్ సభ్యులు మండిపడ్డారు. వారి వాదనలను విన్న ఛైర్మన్ ఇంజనీరింగ్ అధికారాల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ మీరు పొంతనలేని సమాధానాలు చెప్పటం అలవాటు చేసుకున్నారు. మీకు నచ్చినట్లుంటే క్షమించేది లేదు. మీరు ఇంజనేర్లు కాదా? అడ్డదిడ్డంగా పనులు చేస్తున్నారు. వివరణ అడిగితే అన్నీ అబద్ధాలు చెబుతున్నారు. తిరిగి మాతో చర్చించామని చెబుతున్నారు. మీరు ఎప్పుడు మాతో చర్చించారు. అని నిలదీశారు. ముఖ్యంగా పారిశుధ్యం, విధ్యుత్ సమస్యలపై వచ్చిన అజండాలపై గరం గరంగా చర్చ జరిగింది. అలాగే ఎజండాలో తేదీలు కూడా తప్పు ఉన్నాయి. దాంతో కౌన్సిలర్ రాజేష్ తీవ్ర స్వరంతో అధికారులను ప్రశ్నించారు. గ్రాడ్యుయేట్లను మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్లుగా తీసుకునే అంశంపై మాట్లాడుతూ బినామీ ఏజన్సీల ద్వారా వారిని తీసుకున్నారని దీనికి వివరణ ఇవ్వాలని పట్టుపట్టారు. సెనర్జీ ఎంటర్‌ప్రైజర్స్ (విశాఖ)కే అన్ని పనులు అప్పగించటంలో అర్థమేంటని ప్రశ్నించారు. అలాగే రోడ్ల విస్తరణ పనులపై జరిగిన 22వ అంశంపై మాట్లాడుతూ డబుల్ డి.టి.ఆర్ ఎందుకు చెల్లించాలని అన్నారు. రోడ్ల విస్తరణలో కోల్పోయిన దేవాలయాల ప్రహారీగోడలు నిర్మించటంపై చర్చ రాగా మరి రోట్ల విస్తరణలో చర్చి, మసీదులు కూడా ఉన్నాయని వాటి గోడలు కూడా కడతారా అన్న ప్రశ్నించారు. దానికి సమాధానం రాకపోవటంతో ఆ అంశం వాయిదా వేవారు. అలాగే 23 అంశం గ్రాడ్యుయేటర్ల నియామకం, వారి సేల వినియోగం చెల్లింపుల అంశంపై కూడా వాయిదా పడింది. ఒకటవ వార్డు కౌన్సిలర్ సోము స్రవంతి మాట్లాడుతుండగా మధ్యలో అంతరాయం కలగటంతో "నాలుగేళ్ళు మౌనంగా ఉన్నాం..ఇప్పటికీ మాట్లాడనివ్వరా? అని ఎదురుప్రశ్న వేయగా అవకాశం ఇచ్చారు. జీరో అవర్‌లో చర్చలు జరగడం... ఎజండాలోని అంశాలపై చర్చలు జీరోగా మారటంతో పలువురు కౌన్సిలర్లు అసంతృప్తిని వ్యక్తం చేశారు. గత ఐదారు మాసాలుగా వీధి దీపాలు వెలగటం లేదని సంబంధి సంస్థ ఈ విషయమై స్పందించటం లేదని తెలపగా మరలా వారికే బిల్లుల చెల్లింపు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. అత్యంత అవసరమైన వీధి దీపాల నిర్వహణ, పారిశుధ్యం, రోడ్ల విస్తరణ పనులపై నిర్లక్ష్యం వహించటం తగదని ఛైర్మన్‌ను నిలదీశారు.

# పార్టీ సిద్ధాంతాల మేరకు పనిచేయాలి



కంచరపాలెం: తేదేపా సిద్ధాంతాల మేరకు పనిచేయాలని టీడీపీ 41వ వార్డు అధ్యక్షుడు పెంటకోట త్రినాథ్‌రావు కార్యకర్తలకు సూచించారు. ఈ మేరకు సుభాష్ నగర్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో శనివారం ఉదయం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గాలని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఇలా ఏ సమస్య పైనైనా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ప్రత్యేక విజన్ ఉందన్నారు. పశ్చిమ నియోజక వర్గం ఎమ్మెల్యే గణబాబు సారధ్యంలో ఇప్పటికే వార్డు లో పలు అబివృద్ధి కార్యక్రమాలు చెపట్టడం జరిగిందని అందులో బాగంగా 50 లక్షల వ్యయంతో వార్డు లో సి.సి రోడ్ల నిర్మాణాలు ప్రారంభం కానున్నాయన్నారు . అదేవిదంగా అశ్వని పాలెం వద్ద నిర్మించిన కమ్యునిటీ హల్ నిర్మణపనులు పూర్తి కనున్నాయని జూలై నెలలో ఎమ్మెల్యే గణబాబు చెతులమీదుగా కమ్యునిటీ హల్ ప్రారంబోత్సవానికి సన్నహాలు చేస్తున్నామన్నారు.పార్టీ అధిష్ఠానం అదేశాల మేరకు ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు అందరికి అందేవిధంగా కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈసమావేశంలో టీడీపి రాష్ట్ర నాయకులు నాగల అప్పలరాజు వార్డు మాజీ కార్పొరెటర్ పెంటకోట విరలక్ష్మి, నాయకులు కార్తీక్ కుట్టా, బొత్స శ్రీను , జి.శ్రీను, వి.రమణ, పైడిరాజు, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నూతన హార్బర్ పోలీస్ స్టేషన్ భవనానికి శంకుస్థాపన

విశాఖపట్నం : విశాఖ నగరం లోని రామకృష్ణ జంక్షన్ రైతు బజారు వద్ద నూతనంగా నిర్మిస్తున్న హార్బర్ పోలీస్ స్టేషన్ భవన సముదాయానికి విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ చైర్మన్ ఎం.టి కృష్ణబాబు గురువారం శంకుస్థాపన చేశారు. దీని కోసం పోర్టు 1000 చదరపు మీటర్ల భూమిని కేటాయించింది. పోర్టు లోపల స్టాకింగ్ యార్డ్ పునర్నిర్మాణంలో భాగంగా హార్బర్ పోలీస్ స్టేషన్ ను సైతం తొలగించారు.

విశాఖ నగర పోలీసు కమీషనర్ విజ్ఞప్తి మేరకు పోర్టు యాజమాన్యం రామకృష్ణ జంక్షన్ వద్ద రైతుబజార్ సమీపంలో అందరికి అందుబాటులో ఉండేలా హార్బర్ పోలీస్ స్టేషన్ కు స్థలం కేటాయించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ చైర్మన్ ఎం. టి కృష్ణబాబు మాట్లాడుతూ హార్బర్ పోలీస్ స్టేషన్ నిర్మాణం కోసం 1 కోటి 16 లక్షల రూపాయలు వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు. అన్ని సదుపాయాలతో మోడల్ స్టేషన్ గా నిర్మించనున్నట్లు తెలిపారు. రామకృష్ణ జంక్షన్ ఐతే అందరికి అందుబాటులో ఉంటుందని ఇక్కడ స్థలాన్ని ఎంపిక చేసినట్లు కృష్ణబాబు వెల్లడించారు. ఏడాది కాలంలో స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ 2 రవికుమార్ మూర్తి, ఎసిపి రంగరాజు తో పాటు పోర్టు విభాగాధిపతులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## అప్పన్న ఆలయంలో

# వడాయతీ సంప్రోక్షణ దర్శన వేళలలో స్వల్పమార్పు



సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి (అప్పన్న) ఆలయంలో నేడు వడాయతీ సంప్రోక్షణ జరగనున్నది. ఉదయం సుప్రభాత సేవ అనంతరం ఈ సంప్రోక్షణ జరుపబడును అన్నిసన్నిధిలలో దేవతామూర్తులకు తిరుమంజనాలు నిర్వహించి వస్త్రాలంకరణ చేయుదురు తదనంతరం ఆరాధన ధూప సేవ బాలభోగం విశేష ఆరగింపులు తీర్థగోష్ఠి మొదలుగు విశేష కార్యక్రమములు జరుగును,

అనంతరం ఉదయం గం 6:30 ని లకు యధావిధిగా భక్తులకు దర్శనములు లభించును మధ్యాహ్నం 2:30 ని ల నుండి 3 :30 వరకు పవళింపుసేవ తదనంతరం ఆస్థాన ఆరగింపులు పొంగళి దద్దోజనం వడపప్పు శీతలములుతో పాటుగా మామిడిపళ్ళు అనాసపండు పనస పండ్లతో విశేష ఆరగింపు జరుపుదురు అనంతరం శ్రీస్వామివారి తిరువీది ఉత్సవం జరుగును కనుక మధ్యాన్నం 2 :30 ల నుండి 4 గం.ల వరకు దర్శనములు లభించవు సాయంత్రం 4 గం ల తరువాత దర్శనములు యధావిధిగా లభించును అని అధికారులు తెలిపారు.

# మైనార్టీల సంక్షేమమే తెలుగుదేశం ప్రభుత్వ ధ్యేయం

## పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



సబ్బవరం: ముస్లిం మైనార్టీల సోదరుల సంక్షేమానికి తెలుగుదేశం ప్రభుత్వం ధ్యేయంగా కృషి చేస్తుందని పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రంజాన్ పండగ సందర్భంగా ముస్లింలు సోదరులకు రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొని తెల్లకార్డుదారులైన ముస్లింల సోదరులకు 250మందికి ఒక్కొక్కరికి 5కేజీ ల గోధుమపిండి, 2 కేజీల పంచదార, 1 కేజి సేమియా, వందగ్రాముల నెయ్యితో కూడిన బ్యాగులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత ముస్లింలు మైనార్టీల సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ఈ నాలుగేళ్ళ నుంచి ఈ రంజాన్ తోఫా అందిస్తున్నారని గుర్తు చేశారు. దుల్హన్ పథకం కింద ముస్లింల ఆడపిల్లల పెళ్ళికి రూ.50వేలు ఆర్థిక సహాయం అందిస్తుందని, మరియు పెళ్లికాని 35 సం॥ల ముస్లింల మహిళలకు, అలాగే పెళ్లి అయ్యి భర్తకు దూరంగా వున్న ముస్లింల మహిళలకు రూ.1000 పింఛన్ ప్రభుత్వం ఇస్తుందన్నారు. మండలంలో పెండింగ్‌లో వున్న సబ్బవరం స్మశాన వాటికకు నిధులు మంజూరు చేస్తానని అన్నారు. మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్య క్రమంలో తహశీల్దార్ పి.రామారావు, ఎంపీడీఓ రమేష్ నాయుడు, జెడ్పీటీసీ గేదల సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు మిడతాడ మహలక్ష్మి నాయుడు, గండి దేముడు, కొటాన అప్పారావు, గవర అప్పారావు, కె.శ్రీనివాసరావు, వీఆర్వో సంఘం అధ్యక్షుడు ఎస్.త్రినాధ రామకాసు, కొప్పాక శేషు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ తోఫాను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు

# రక్తదానం చేయండి మరొకరికి ప్రాణదానం కండి

## బ్యాంకు మేనేజర్ పి. శ్రీనివాస్



అనకాపల్లి : ప్రపంచ రక్తధాన దినోత్సవం పురస్కరించుకుని, పట్టణంలో గల సర్వేజన సుఖినోభవంతు సంస్థ ఆధ్వర్యంలో వన్‌వే డౌన్ వద్ద గల బ్యాంకు ఆఫ్ బరోడా కార్యాలయంలో రక్తధాన కార్యక్రమాన్ని, గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రమాద స్థాయిలో ఉన్నవారికి, రక్తదానం చేయడంలో మరొకరి ప్రాణధానం చేసిన వారు అవుతామని, రక్తధానం చేయడానికి యువత ముందుకు రావాలని ఆయన అన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న, అనేక మందికి అవసరమైన రక్తం లేక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఆయన విచారం వ్యక్తం చేసారు. ప్రజలలో ఇంకా రక్తధానం చేయడానికి, ప్రోత్సాహకంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. సంస్థ అధ్యక్షులు కోరిబిల్లి పరమేష్ (పరి) మాట్లాడుతూ సంస్థ ద్వారా ఇప్పటికీ 70 సార్లు రక్తధానం కార్యక్రమాలు నిర్వహించామని, ఆయన అన్నారు. పట్టణంలో రక్తదాన అవగాహపై ర్యాలీ నిర్వహిస్తున్నామని, ఎక్కువ సార్లు రక్తదానం చేసిన దాతలకు సంస్థ ద్వారా ఘనంగా సత్కరించడం జరుగుతుందని అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జ్ బాలకృష్ణ నేతృత్వంలో జరిగిన, ఈ రక్తదాన కార్యక్రమంలో బి. సతీష్, ఎ. ప్రవీణ్, గణేష్, రమేష్, మోహన్, ఆనంద్, శ్రావణ్ ఉషాప్రైం బొడ్డేడ సతీష్, దాసరి సంతోష్, బాబీ, (ఫోటో) మహిళలు, తదితర యువకులు రక్తదానం చేశారు.



జిల్లా కలెక్టర్ ధనుంజయరెడ్డిని ఇచ్ఛాపురం సమన్వయకర్త పిరియా సాయిరాజ్ మరియు శ్రీకాకుళం పార్లమెంటరీ సమన్వయ కర్త దువ్వాడ శ్రీనివాస్ కలిసి ఇటీవల ఎర్రముక్కాం గ్రామంలో ఎలుగుబంటి దాడిలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను వెంటనే ఆదుకోవాలని 25 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని, గాయపడిన వారి కుటుంబాలకు 5 లక్షలు ఇవ్వాలని మెరుగైన వైద్యం అందించాలని కోరడమైనది.

## రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కోన లక్ష్మణ్



అనకాపల్లి : ఈనెల 12, 13 తేదీల్లో గుంటూరు జిల్లా వినుకొండలో జరిగే, ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటియూసి) నాల్గవ రాష్ట్ర మహాసభల్లో అనకాపల్లి మండలం, మూలపేట గ్రామానికి చెందిన, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కోన లక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఆ ఎన్నికల పట్ల, రాష్ట్ర అధ్యక్షులు పడాల రమణ, ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఏఐటియూసి రాష్ట్ర అధ్యక్షులు చలసాని వెంకటరామారావు ప్రధాన కార్యదర్శి జి. ఓబ్లేస్, డిప్యూటీ కార్యదర్శి రవీంద్రనాథ్, తదితరులు హర్షం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా కోన లక్ష్మణ్ మాట్లాడుతూ రెండవ సారి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తనపై ఉన్న నమ్మకంతో పదవును, అప్పగించడంపట్ల ఆయన అభినందనలు తెలియజేసారు. జిల్లాలో ఉన్న, సంఘాలను, బలోపేతం చేయడానికి, కార్మికుల సమస్యలపై నిరంతరం పనిచేస్తానని, ఆయన అన్నారు. 1998 నుండి, ఏఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ జిల్లా నేతగా, పనిచేసారు. ప్రస్తుతం ఏఐటియూసి అనుబంధం కార్మిక సంఘాలు జిల్లా కార్యదర్సి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ అధ్యక్షులుగా కొనసాగు తున్నారు. ఆయన ఎన్నికలపట్ల అనకాపల్లి, నర్సీపట్నం డివిజన్ భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు హర్సం వ్యక్తం చేశారు.

## అర్హులైన వారందరికీ వెంటనే ప్యాకేజీ ఇవ్వాలి

అచ్యుతాపురం : పూడిమడక ఎపిఐఐసి పైపు లైను నిర్మాణ విషయంలో ప్రభుత్వం తమను పూర్తిగా మోసం చేసిందని పూడిమడక మత్స్యకారుల ఐక్య కార్యాచరణ కమిటీ గురువారం కదం తొక్కింది. స్థానిక సబ్‌మెరైన్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ గతంలో ఎన్నో వాగ్ధానాలు చేశారని, కాని అంఆఎదులో ఏ ఒక్కటి అమలు చేయలేదని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. పైపులైను నిర్మాణ విషయంలో ఉద్యోగ, ఉపాధి, జెట్టి నిర్మాణం, ఎస్.ప్లాంట్, పైపు లైను నిర్మాణం నాటికి 18సం॥లు నిండిన వారికి ప్యాకేజీ అని మోసపూరిత మాటలు చెప్పి, ఇప్పుడు మొండిచేయి చూపించారన్నారు. ఫార్మాకంపెనీ యొక్క వ్యర్ధ జలాలు సముద్రంలోకి వదలటం కారణంగా, మత్స్యసంపద మొత్తం నాశనమైపోతుందని, నెత్తినోరు కొట్టుకుంటున్న వారి బాధ వినే నాధుడే కరువయ్యారు అన్నారు. కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు మీన వేషాలు లెక్కిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్‌ఆర్‌సిపి నాయకులు చేపల శ్రీరాములు, వాసుపల్లి శ్రీనివాసరావు, ఇరిపిళ్ళ భాను, సిపియం నాయకులు, రొంగలి రాము, కొవిరి అప్పలరాజు, చేపల తాతలు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చత్తీస్‌ఘడ్‌తో అనుసంధానం

విశాఖపట్నం: ఎయిర్ ఒడిశా నూతన విమానమార్గం రాయ్‌పూర్-జగల్‌పూర్-వైజాగ్‌లను బిలాయ్ నుండి లైన్ వీడియో ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించారని, నూతన విమానాలను ప్రవేశపెట్టడం ద్వారా సుదీర ప్రాంతాలు అనుసంధానం, వేగవంతమైన అభివృద్ధి సాధ్యమని ఎయిర్ ఒడిశా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శైశవ్ షా ప్రకటనలో తెలిపారు. చత్తీస్‌ఘడ్‌ను ఆంధ్రప్రదేశ్‌తో కలుపుతూ నూతన మార్గాలను ప్రారంభిస్తున్నందుకు చాలా ఆనందంగా వుందన్నారు.

## పాఠశాలలో బోరుకు మరమ్మత్తులు

రోలుగుంట : కొండపాలెం పాఠశాలలో మరమ్మత్తులకు గురైన తాగునీటి బోరు వినియోగంలోకి వచ్చింది. పంచాయతీ సర్పంచ్ బుంటు సూర్యసన్యాసిదేముళ్లు స్పందించి మరమ్మత్తులు చేయించారు. దీంతో పాఠశాల హెచ్‌ఎం అప్పారావు కృతజ్ఞతలు తెలిపారు.

**IN THE HON'BLE COURT OF THE ADDITIONAL FAMILY JUDGE AT : VISAKHAPATNAM.**
**F.C.O.P. 1503/2016**

**Between**
**M.Vijaya Mani ...Petitioner**
**And**
**M.Rajasekhar ...Respondent**

**NOTICE**

**To,**
**The Respondent:**
**Sri. M.Raja Sekhar, S/o.late Kondal Rao, Christian, aged about 58 years, Retired Employee, Addala Veedhi, Nakkapalli, Visakhapatnam District.**

పై నెంబరు పిటిషన్ నందు పిటిషనర్‌గారు మీ పై విడాకులు నిమిత్తం దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే.25-06-2018దికి** వాయిదా అయివున్నది. కావున **తే.25-06-2018దిన** మీరు స్వయంగా గాని, లేదా మీ తరపున వకీలు గారి ద్వారా గాని పై తెలిపిన కోర్టులో ఉదయం **గం॥10:30 ని॥లకు** హాజరై మీ యొక్క ఆక్షేపణలను మనవి చేసుకొనవలెను. లేనియెడల పై పిటిషన్‌లో మీకు ఎటువంటి ఆక్షేపణలు లేవని భావించి శ్రీకోర్టువారు మీ పరోక్షమందు తీర్మాణించడమగునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

**P. ANURADHA,**
**PADMA BAI**
**Advocates**
**Visakhapatnam.**